




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 06.02.2025 | సంపుటి : 11 సంచిక : 208 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









# ఢిల్లీ అసెంబ్లీ పోలింగ్ ప్రశాంతం



**సాయంత్రం 5గంటల వరకు 57.70 శాతం ఓటింగ్ • 8న ఓట్ల లెక్కింపును చేపట్టనున్న ఈసీ**

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు • మూడు ఆప్ నియోజకవర్గాలపైనే అందరి దృష్టి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం ఏడు గంటలకు మొదలైన ఓటింగ్ ప్రక్రియ 6గంటలకు ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు 57.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. నార్త్‌-ఈస్ట్ ఢిల్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 52.73శాతం పోలింగ్ నమోదుకాగా..



న్యూదిల్లీలో అత్యల్పంగా 43.1శాతం పోలింగ్ రికార్డైంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, దిల్లీ సీఎం ఆతిశీ, కేంద్ర మంత్రి జై శంకర్ సహా పలువురు ప్రముఖులు తొలి గంటల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలతో

మిగతా 2లో..



# త్రిషకు రూ. కోటి

**నజరానా ప్రకటించిన సీఎం రేవంత్**

క్రికెటర్ గొంగడి త్రిషకు సిఎం రేవంత్ రెడ్డి రూ.కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో రాణించిన క్రికెటర్ గొంగడి త్రిష బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా త్రిషను అభినందించి, శాలువాతో సీఎం సత్కరించారు. ఆమెకు రూ. కోటి నజరానా ప్రకటించారు. భవిష్యత్తులో దేశం తరపున మరింతగా రాణించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఐటీ చెల్లిస్తే ఇకపై నో రేషన్

**అనర్హుల ఏరివేత దిశగా కేంద్రం అడుగులు!**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలను ఆహార మంత్రిత్వ శాఖతో ఐటీ విభాగం పంచుకోనుంది. తద్వారా ఏరివేత ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చెల్లించని వారికి పీఎంజీకేఏవై కింద పేద

మిగతా 2లో..



## క్రమశిక్షణ గీత దాటారో..

# ఖబర్దార్



**ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదు**

- నిబంధనలు పాటించనివారిపై వేటు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- పీసీసీ కమిటీలో 50-60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారు
- ఇప్పటి వరకు ఏ రాష్ట్రమూ చేయని ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసింది
- అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాల్సిందేనని, పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ కమిటీలో 50-60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారని తెలిపారు. మెజార్టీలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా న్యాయం జరగటం లేదన్నారు."కులగణన సర్వే కోసం బీసీ సంఘాలు చాలా ఏళ్లు ఎదురుచూశాయి. గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాలి. భవిష్యత్‌లో జరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలి. కేంద్రం చేసే జనగణనలో కులగణన కూడా చేస్తానని భాజపా చెప్పాలి.

మిగతా 2లో..

## వర్గీకరణ ఓకే..

# లోపాలు సరిదిద్దండి

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు కృష్ణమాదిగ డిమాండ్**

**15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే 32 లక్షలు ఉన్న మాదిగలకు 11 శాతం రావాలి**

**తమకు రావాల్సిన దానికంటే 2 శాతం తక్కువ వచ్చిందని వెల్లడి**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని..మాదిగల జనాభాకు తగ్గట్లుగానే రిజర్వేషన్ల వాటా ఉండాలని విన్నవించామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నివేదికలో 9శాతం రిజర్వేషన్లే దక్కుతున్నాయన్నారు."15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. 32 లక్షలు ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్ల పంపిణీలో లోపాలను సరిదిద్దాలి. మాకు రావాల్సిన దానికంటే 2 శాతం తక్కువ ఉన్నాయి" అని మందకృష్ణ మాదిగ అన్నారు.కాగా

మిగతా 2లో..



## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో టెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జనవరి 2 నుంచి 20 వరకు జరిగిన టెట్ పరీక్షలకు 1,35,802 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 42,384 మంది (31.21 శాతం) అర్హత సాధించారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

# గాజాను హస్తగతం చేసుకుంటాం



**అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం**

**ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తాం**

- నెతన్యాహుతో భేటీ అనంతరం ట్రంప్ సంచలన ప్రకటన
- మండిపడ్డ ఇస్లామిక్ దేశాలు, హమాస్
- గాజాలో మా లక్ష్యాలన్ని నెరవేర్చుకుంటాం:నెతన్యాహూ

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, గాజా యుద్ధం నేపథ్యంలో తాజా పరిస్థితిపై నెతన్యాహూతో ట్రంప్ చర్చించారు. 'గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే.. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు, ఇళ్లు నిర్మించవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహూ అభిప్రాయపడ్డారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి. అలా చేస్తే తమ ప్రాంతంలోని

మిగతా 2లో..

**ఇరాన్ 'అణ్వాయుధ' సన్నద్ధతకు**

## ట్రంప్ బ్రేకులు

**మళ్లీ ఆ దేశంపై ఆంక్షల దిశగా అడుగులు**



2లో



**కులగణనలో పాల్గొనని వారికి**

# మాట్లాడే నైతిక హక్కు లేదు

**సర్వేను అడ్డుకోవడానికి భారాస కుట్ర**

**ఈ ప్రక్రియ ద్వారా బలహీన వర్గాలకు ఒక రోడ్ మ్యాప్ తయారైంది : మంత్రి పొన్నం**

**హైదరాబాద్(జనంసాక్షి):** కులగణన జరగకుండా చేయాలని భారాస కుట్ర చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. భారాసలో మూడు కీలక పదవులు ఒకరికే ఉండటంపై ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కులగణనలో పాల్గొనని వారికి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కులగణన సర్వే ద్వారా బలహీన వర్గాలకు ఒక రోడ్ మ్యాప్ తయారైందని పొన్నం పేర్కొన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలని.. బాధ్యతగా తీసుకొని సరిచేస్తామన్నారు. డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలు చేస్తామని వెల్లడించారు.



**బీసీ డిక్లరేషన్**

# ఓ బూటకం

**కాంగ్రెస్ హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలే : కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** కేటీఆర్ ఏడాదిగా విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి దేనిపైనా స్పష్టతలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని ధ్వజమెత్తారు. ఏడాదిగా విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి దేనిపైనా స్పష్టతలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లన్నీ

మిగతా 2లో..

# ఢిల్లీ పీఠం భాజపాదే..

**అన్ని సర్వేల్లోనూ బిజెపికే మొగ్గు**

**ఎగ్జిట్ పోల్స్ ప్రకటించిన ఆయా సంస్థలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** న్యూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిచడంతో ఆయా సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. ఢిల్లీ ఓటరు.. బీజేపీకి పట్టం కట్టినట్లు దాదాపు అన్ని సర్వేల్లో స్పష్టమైనట్లు

మిగతా 2లో..



## కుంభమేళాలో పాల్గొన్న మోడీ



**ప్రయాగరాజ్(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ప్రయాగ్ రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానం ఆచరించారు. 'మహా కుంభమేళాకు హాజరు కావడం దైవానుగ్రహమే' అని భావిస్తున్నానని ఆయన తెలిపారు. 'భక్తితో ధ్యానంలో నిమగ్నమైనట్లు' ఆయన చెప్పారు. ప్రధాని మోడీ

మిగతా 2లో..

# దేశానికి ఇది అవమానం

**అమెరికా నుంచి భారతీయులను నేరస్థుల్లా సంకెళ్లు వేసి పంపడం దారుణం**

- వెనక్కి పంపించడంపై కాంగ్రెస్ విమర్శలు
- అమృత్‌సర్‌లో దిగిన అమెరికా ప్రత్యేక విమానం
- ట్రంప్ ఆదేశాలతో 205మంది తరలింపు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్నవిషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. అక్కడి భారతీయుల చేతికి సంకెళ్లు వేసి..వారిని నేరస్థులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి..అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తించినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని కలవడానికి అప్పటి యూపీఏ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యూఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరించుకుందని పేర్కొన్నారు.కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా

మిగతా 2లో..

# హరీశ్‌రావును అరెస్ట్ చేయొద్దు

**ఈ నెల 12 వరకు ఆగండి: హైకోర్టు**

**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావును ఈనెల 12 వరకు అరెస్టు చేయొద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును క్వాష్ చేయాలని హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హరీశ్‌రావును అరెస్టు చేయొద్దన్న మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన న్యాయస్థానం.. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది.

## అప్పుడే ఎండలు భగ.. భగ..

2లో

**తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు**

# రైతు భరోసా నిధుల జమ

**ఎకరం వరకు సాగు చేస్తున్న భూములకు సంబంధించి మొత్తం 17.03 లక్షల రైతుల ఖాతాలకు సొమ్ము : మంత్రి తుమ్మల**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో రైతుభరోసా నిధులు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రకటన చేశారు. బుధవారం నుంచి ఖాతాల్లో జమ కానున్నాయని మంత్రి తెలిపారు. ఎకరం వరకు సాగు చేస్తున్న భూములకు సంబంధించి మొత్తం 17.03 లక్షల రైతుల అకౌంట్లకు సాయం బుధవారం జమ కానుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దీన్ని పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.





# ఎల్బీనగర్‌లో విషాదం

**సెల్లార్ తవ్వుతుండగా పైనుంచి పడ్డ మట్టిదిబ్బలు**

**అక్కడికక్కడే ముగ్గురి మృతి..**

**మరోకరికి తీవ్రగాయాలు**

**హైదరాబాద్,(జనంసాక్షి):** నగరంలోని ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల్లో అపశృతి చోటు చేసుకుంది. సెల్లార్ లోపల పనిచేస్తుండగా పైనుంచి మట్టిదిబ్బలు కుప్పకూలాయి.

మిగతా 2లో..

## బీసీ డిక్లరేషన్ ఓ బూటకం

బూటకమని తేలిపోయాయని చెప్పారు. ఆయన తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిదని ఎక్స్ వేదికగా విమర్శించారు.'నిన్నటి అసెంబ్లీ సమావేశం.. తెలంగాణ ప్రజలకు రెండు విషయాలు స్పష్టం చేసింది. ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసింది. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం లేదని నిన్నటితో తేలిపోయింది. రిజర్వేషన్ల అంశంపై నిస్సిగ్గుగా కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలని పన్నాగం వేసింది. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయింది. అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న రాహుల్ గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధం. ఈ సర్కారు నిబద్ధత వంద శాతం నకిలీ' అంటూ ట్వీట్ చేశారు.

## ఐటీ చెల్లిస్తే ఇకపై నో రేషన్

కుటుంబాలకు ప్రభుత్వం ఉచిత రేషన్ అందిస్తున్న విషయం తెలిసిందే. 2024 జనవరి 1 నుంచి ఐదేళ్ల పాటు ఉచితంగా ఆహారధాన్యాలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.1.97 లక్షల కోట్లు వెచ్చించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తాజా బడ్జెట్‌లో రూ.2.03 లక్షల కోట్లను ప్రతిపాదించింది.దేశంలో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అనర్హుల ఏరివేతకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (అఃఆ) తాజాగా ఓ ఆఫీసు ఆర్డర్‌ను జారీ చేసింది. ఇందులో భాగంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (సిస్టమ్స్).. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆహారం, ప్రజా పంపిణీ విభాగం జాయింట్ సెక్రటరీతో సమాచారాన్ని పంచుకోనుంది. ఆధార్, పాన్, మదింపు సంవత్సరం వివరాలను సమర్పిస్తే.. నిర్ణీత మొత్తం కంటే ఆదాయం కలిగిన వారు ఉన్నవారి డేటాను డీజీఐటీ సిస్టమ్స్ అందిస్తుంది. అనర్హుల వివరాల గుర్తింపులో ఈ డేటా కీలకం కానుంది. ఈ గుర్తింపు పూర్తయ్యాక కేంద్రం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## కుంభమేళాలో పాల్గొన్న మోడీ

పుణ్య స్నానం ఆచరిస్తున్నప్పుడు చేతిలో రుద్రాక్షమాల పట్టుకున్నారు. ముదురు కాషాయ రంగు జెర్సీ ధరించిన మోడీ మంత్రోచ్చాటన చేస్తూ సూర్యునికి, గంగకు ప్రార్థనలు చేశారు. 'ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో పాల్గొనడం దైవానుగ్రహమే. త్రివేణి సంగమం వద్ద కోట్లాది మందిఇతర భక్తుల వలె పుణ్య స్నానం ఆచరించాను. 'భక్తితో ధ్యానంలో నిమగ్నమయ్యాను' అని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. 'గంగా మాత శాంతి, విజ్ఞత, మంచి ఆరోగ్యం, సమరస భావంతో అందరినీ ఆశీర్వదించుగాక' అని మోడీ అన్నారు.ప్రధాని మోడీ త్రివేణి సంగమం వద్దకు అరైల్ ఘాట్ నుంచి ఒక పడవలో చేరుకున్నారు. ఆయన వెంట ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. మోడీ ఆ ప్రదేశానికి చేరుకునేటప్పుడు నదికి రెండు వైపుల బారులు తీరిన జనసమూహం చేతులు ఊపుతుండగా ఆయన ప్రత్యభివాదం చేశారు. పవిత్ర స్నానం ఆచరించిన తరువాత ప్రధాని మోడీ నదిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక వేదికపైకి ఎక్కి హారతి సహా పూజాదికాలు నిర్వహించారు. ఆయన పవిత్ర నదులకు పాలు, పూలు సమర్పించారు. ఆయన త్రివేణి సంగమం వద్ద ఒక చీర కూడా సమర్పించారు. ఒక అర్చకుని మార్గదర్శకంలో ప్రధాని మోడీ ఆ పక్రియలు నిర్వర్తించారు. కాగా, ప్రధాని పర్యటన కోసం భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు, ఉత్తర ప్రదేశ్ మిల్కీపూర్‌లో ఉప ఎన్నిక జరుగుతున్న రోజు ఆయన పర్యటన చోటు చేసుకున్నది.

కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తజనం

అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ కోట్లాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మౌని అమావాస్య రోజు జరిగిన దుర్ఘటన తప్ప అన్ని రోజులు సజావుగా సాగుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ కూడా బుధవారం పుణ్యస్నానం ఆచరించారు. భీష్మ అష్టమి సందర్భంగా ఆయన ప్రయాజ్ రాజ్ వచ్చి త్రివేణి సంగంలో స్నానమాచరించి, సూర్యుడికి తర్పణం వదిలారు. సరిగ్గా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రధాని మోదీ హాజరయ్యారు.ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు. అరైల్ ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం గంగా, యమునా, సరస్వతి త్రివేణి సంగమంలో ప్రధాని మోదీ పుణ్యస్నానం ఆచరించారు. తిరిగి బోటులో ఆ ప్రాంతం నుంచి అరైల్ ఘాట్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత అరైల్ ఘాట్ నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి తిరిగి ఢిల్లీ బయల్దేరుతారు. మోదీ పర్యటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ నగరంతోపాటు కుంభమేళా దగ్గర భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ముగియనుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు త్రివేణి సంగమానికి పోటెత్తారు భక్తులు. ప్రయాగ్‌రాజ్ ఘాట్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటి వరకు 38కోట్ల మంది కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. సామాన్యులతోపాటు అనేక మంది ప్రముఖులు కూడా ఈ కుంభమేళాకు హాజరవుతున్నారు.







# ఢిల్లీ అసెంబ్లీ పోలింగ్ ప్రశాంతం

పాటు తమిళనాడులోని ఈరోడ్(ఈస్ట్), ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిల్కిపుర్‌లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయోధ్య జిల్లాలోని మిల్కిపుర్‌లో ఉప ఎన్నికను సమాజ్‌వాదీ పార్టీ, భాజపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. 8న ఓట్ల లెక్కింపు జరుగనుంది. బిజెపి, ఆప్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించి పోరాడాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఏపార్టీకి మెజార్టీ వస్తుందనే సంగతి పక్కనపెడితే.. అందరి దృష్టి మూడేమూడు నియోజకవర్గాలపై ఉంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఈ మూడు నియోజవర్గాల్లో అధికార ఆప్‌కు చెందిన ముగ్గురు కీలక నేతలు పోటీచేయడంతో ఈ నియోజకవర్గాలపై ఆసక్తి నెలకొంది. మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి అతిషి, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఫలితం ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ కొనసాగు తోంది. అరవింద్ కేజ్రీవాల్, అతిషి ఈజీగా గెలుస్తారని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తుండగా ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని చెప్పేవాళ్లు లేకపోలేదు. దీంతో ఈ మూడు నియోజకవర్గాల ఓటర్లు ఎలాంటి తీర్పునిచ్చారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. గత మూడు ఎన్నికల్లో వరుసగా ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్న కేజ్రీవాల్ నాల్గవసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2020లో 21వేల687 ఓట్ల మెజార్టీతో గెలిచిన కేజ్రీవాల్ ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఢిల్లీ మాజీ సీఎం షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేస్తుండగా.. బీజేపీ నుంచి పర్వేష్ సింగ్ వర్మ పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి పోటీలో ఉండటంతో ఓట్లు చీలి బీజేపీ అభ్యర్థి గెలుస్తారనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు కొందరు వ్యక్తం చేస్తున్నారు. విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ అరవింద్ కేజ్రీవాల్‌ను మరోవైపు ఓటమి భయం వెంటాడుతుందనే ప్రచారం జరుగుతోంది. కేజ్రీవాల్ ఓడిపోతే మాత్రం రాజకీయంగా ఆయనకు గట్టి ఎదురుదెబ్బగా భావించాల్సి ఉంటుంది.ఢిల్లీ సీఎం అతిషి కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. ఆమె ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని నిలబెట్టడంతో ఆమెకు కొంత ఇబ్బంది ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అల్కలంబ కాంగ్రెస్ నుంచి, రమేష్ బిదురి బీజేపీ నుంచి పోటీచేస్తున్నారు. రమేష్ బిదురి బీజేపీ నుంచి గతంలో ఎంపీగా పనిచేశారు. ముగ్గురు బలమైన అభ్యర్థులు కావడంతో ఈ నియోజకవర్గంలో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ కీలక నేత మనీష్ సిసోడియా ఈసారి తన నియోజకవర్గాన్ని మార్చుకున్నారు. ప్రతాప్‌గంజ్ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన సిసోడియా ఈసారి జంగ్‌పుర నుంచి బరిలో దిగారు. 2015, 2020 ఎన్నికల్లో ఆప్ నేత ప్రవీణ్ కుమార్ ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ప్రస్తుతం సిసోడియా పోటీచేయగా.. ఆయనపై తర్విందర్ సింగ్‌ను బీజేపీ పోటీకి పెట్టగా.. కాంగ్రెస్ పర్హద్ సూరిని పోటీకి దింపింది.

**అందరూ ఓటేయాలని ప్రధాని మోడీ పిలుపు**

ప్రజాస్వామ్య పండుగలో ప్రజలు పాల్గొనాలని ప్రధాని మోడీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాలకు ఒకేరోజు బుధవారం ఓటింగ్ జరుగుతోంది. ఈ ప్రజాస్వామ్య పండుగలో ఉత్సాహంతో పాల్గొని తమ విలువైన ఓటును వేయాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయనున్న యువతీయువకులకు శుభాకాంక్షలు. ఫస్ట్ ఓట్ దెన్ రిఫ్రెష్‌మెంట్' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.ఒకే విడతలో జరగనున్న 70 శాసనసభ స్థానాలకు సాయంత్రం ఆరు వరకూ ఓటింగ్ జరగనుంది ఇదిలా ఉండగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ఓ పక్క స్వచ్ఛమైన రాజకీయాల గురించి మాట్లాడుతూ అతిపెద్ద కుంభకోణం ఎవరు చేశారో ఓటు వేసేటప్పుడు ఢిల్లీ ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. తమ పార్టీకి ఓటు వేయడం ద్వారా ప్రజల హక్కులు తిరిగి పొందుతారని, రాజ్యాంగం బలోపేతం అయ్యి ఢిల్లీ మళ్లీ ప్రగతి పథంలో పయనిస్తుందని రాహుల్ అన్నారు. న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని నిర్మాణ్ భవన్ పోలింగ్ కేంద్రంలో ఉదయం కాంగ్రెస్ నాయకుడు ఓటు వేశారు. 'నా ప్రియమైన ఢిల్లీ సోదర సోదరీమణులారా' అని సంబోధిస్తూ రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఢిల్లీ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'మీరందరూ ఈరోజే వెళ్లి ఓటు వేయమని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు మీ హక్కులను కాపాడుతుంది. రాజ్యాంగాన్ని బలోపేతం చేసి ఢిల్లీని తిరిగి పురోగతి మార్గంలో నడిపిస్తుంది. ఓటు వేసేటప్పుడు, కలుషితమైన గాలి, మురికి నీరు, చెడిపోయిన రోడ్లకు ఎవరు బాధ్యులో గుర్తుంచుకోండి. స్వచ్ఛమైన రాజకీయాలు చేయడం గురించి మాట్లాడుకుంటూ ఢిల్లీలో అతిపెద్ద కుంభకోణానికి పాల్పడింది ఎవరని ప్రశ్నించారు

## క్రమశిక్షణ గీత దాటారో కబర్దార్

రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదు. వివరాలు ఇవ్వనివారు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రమూ చేయని ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసింది. చేసిన వారిని అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు.

## లోపాలు సరిదిద్దండి

ఎస్సీ ఉప కులాల వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పిడమర్తి రవి, ఖమ్మం జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో సిఎంను కలిసి ఎస్సీ వర్గీకరణ ఆమోదం సాహసోపేత నిర్ణయంగా ప్రకటించారు. అందుకు ఎస్సీలు కృతజ్ఞతగా ఉంటారని అన్నారు. రాష్ట్రం లో ఎస్సీల వర్గీకరణ అంశానికి త్వరలో చట్టబద్ధత కల్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు రాకుండా ఉం దేందుకు వీలుగా చట్టబద్ధత దోహదం చే స్తుందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలోని ఉప కులాలలో రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సిఫార్సు చేసిన క్రిమిలేయర్‌ను తిరస్కరించినట్లు సిఎం చెప్పారు. మంగళవారం శాసనసభలో ఎస్సీ వర్గీకరణ నివేదికపై ప్రకటన చేశారు. వర్గీకరణకు మద్దతు ప్రకటించిన అందరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

## ఢిల్లీ పీఠం భాజపాదే..

ఈ ఎగ్జిట్ పోల్స్ ద్వారా వెల్లడవుతోంది. అయితే కేకే సర్వే మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో మళ్లీ వరుసగా అధికారాన్ని చేపడుతోందంటూ తన సర్వేలో స్పష్టం చేసింది. కానీ చాణక్య స్ట్రాటజీస్, పీపుల్స్ పల్స్, రిపబ్లిక్ పి మార్క్ మాత్రం బీజేపీదే హస్తిన పీఠమని వెల్లడించింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఇప్పటి వరకు 58.20 మేర పోలింగ్ శాతం నమోదయింది. అలాగే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశాన్ని ఎన్నికల సంఘం అధికారులు కల్పించారు. పీపుల్స్ పల్స్- కొడిమో సంస్థల సంయుక్త ఎగ్జిట్‌పోల్ సర్వే ప్రకారం.. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ జెండా ఎగరనుందని స్పష్టం చేసింది. ఈ సర్వేలో బీజేపీ 51-60, ఆప్ 10-19, కాంగ్రెస్‌తోపాటు ఇతరులకు చోటు దక్కదని స్పష్టం చేసింది. అయితే ఢిల్లీలోని మహిళా ఓటర్లు మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీకి జైకొట్టినట్లు పీపుల్స్ పల్స్ కొడిమో వెల్లడించింది. చాణక్య స్ట్రాటజీస్: బీజేపీ 39 నుంచి 44 స్థానాలు, ఆప్ 25 నుంచి 28 స్థానాలు, కాంగ్రెస్ పార్టీ 2 నుంచి 3 స్థానాలు, పీపుల్స్ పల్స్: బీజేపీ 51 నుంచి 60, ఆప్ 10 నుంచి 19 స్థానాలు, కేకే సర్వేలో మాత్రం ఆప్ 39, బీజేపీ 22, రిపబ్లిక్ పిమార్క్: బీజేపీ 39 నుంచి 49, ఆప్ 21 నుంచి 31, కాంగ్రెస్ పార్టీ 1స్థానం గెలుస్తాయని వెల్లడించింది. సర్వే ప్రకారం పోటీ ఆప్, బిజెపిల మధ్యే సాగింది. కాంగ్రెస్ ఎక్కడా గట్టి పోటీ ఇవ్వలేదని తేలిపోయింది.

## జాతీయ స్థాయి ఉన్నత విద్య మంత్రుల సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి) : కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో బుధవారం నిర్వహించిన జాతీయస్థాయి ఉన్నత విద్య మంత్రుల సమ్మేళనంలో తెలంగాణ నుంచి మంత్రి ఎమ్మెల్యే శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వైస్ ఛాన్సలర్ల నియామకం ,ఉన్నత విద్యాసంస్థల నిర్వహణపై యుజిసి ముసాయిదా నిబంధనలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమ్మేళనంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, జమ్మూ అండ్ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి ఉన్నత విద్యాశాఖ మంత్రులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ జాతీయ స్థాయి ఉన్నత విద్య సమ్మేళనంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు.



# గాజాను హస్తగతం చేసుకుంటాం

స్థిరత్వం దెబ్బతింటుందని ఈజిప్తు, జోర్డాన్, సౌదీఅరేబియా, యూఏఈ, ఖతార్, పాలస్తీనా అథారిటీ, అరబ్ లీగ్‌లు సంయుక్తంగా ప్రకటన చేశాయి. ఈక్రమంలోనే గాజాను స్వాధీనం చేసుకొని, అభివృద్ధి చేస్తామని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. గాజాను స్వాధీనం చేసుకుంటానంటూ ట్రంప్ ప్రకటించడాన్ని హమాస్ ఖండించింది. ఆయన గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని మిలిటెంట్ సంస్థకు చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. 'ఈ ప్రాంతంలో గందరగోళం, ఉద్రిక్తతలు సృష్టించడానికే ట్రంప్ ఈ ప్రకటన చేశారు. మా ప్రజలు దీన్ని ఆమోదించరు. వారి భూమి నుంచి వారిని తరలించడమే కాకుండా.. ఈ దురాక్రమణను అడ్డుకోవాల్సి ఉంది' అని సమీఅబు జుహ్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

**గాజాలో నిర్దేశించుకొన్న మూడు లక్ష్యాలు ఇవే: నెతన్యాహూ**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూమాట్లాడుతూ హమాస్‌తో పోరాటం తర్వాత ఇజ్రాయెల్ మరింత బలంగా మారిందన్నారు.చర్చల్లో భాగంగా యుద్ధాన్ని ముగించి.. తమ దేశంలో శాంతిని నెలకొల్పడానికి, ప్రజలకు సురక్షిత భవిష్యత్తును అందించడానికి తాము మూడు ముఖ్యమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నామని అన్నారు. అవి బందీలందరినీ విడుదల చేయడం.. హమాస్ సైన్యాన్ని నాశనం చేయడం.ఇజ్రాయెల్‌కు గాజా మరోసారి ముప్పు కలిగించకుండా చూసుకోవడం.ట్రంప్ తన పరిధిని దాటి యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు చేస్తున్నారని.. ఇజ్రాయెల్ తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవి ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. అమెరికాకు ఇప్పటివరకు ఉన్న అధ్యక్షులలో ట్రంప్ తనకు గొప్ప మిత్రుడని కొనియాడారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం వైట్‌హౌస్‌కు మొదటి విదేశీ నేతగా తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇరుదేశాల మధ్య స్నేహానికి నిదర్శనమని అన్నారు. అందుకే తమ దేశ ప్రజలు ట్రంప్‌ను ఎంతగానో గౌరవిస్తారని పేర్కొన్నారు.దాదాపు ఏడాన్నర పాటు యుద్ధం తర్వాత ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. గాజాలో శాంతిస్థాపనకు ఇరువర్గాలు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. బందీల విడుదలకు సంబంధించి కూడా ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో తాజాగా నెతన్యాహూతో భేటీ అయిన ట్రంప్ గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. యుద్ధంలో ధ్వంసమైన భవనాలను పునరుద్ధరించి.. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. దీనివల్ల అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ఇరాన్ 'అణ్వాయుధ' సన్నద్ధతకు ట్రంప్ బ్రేకులు


### మళ్లీ ఆ దేశంపై ఆంక్షల దిశగా అడుగులు

**వాషింగ్టన్:** అణ్వాయుధ తయారీకి ఆగమేఘాలపై సిద్ధమవుతున్న ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెక్ పెట్టారు. ఆ దేశంపై గరిష్ఠ ఒత్తిడి తీసుకొచ్చేలా మళ్లీ కఠిన విధానాల అమలుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.టెహ్రాన్ చమురు ఎగుమతులను పూర్తిగా సున్నాకు తీసుకొచ్చి.. ఆ దేశ అణ్వాయుధ తయారీ యత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా వీటిని తీసుకొస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీకి ముందు.. ట్రంప్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన తొలి హయాంలో టెహ్రాన్‌పై వాషింగ్టన్ అమలుచేసిన కఠిన విధానాన్ని పునరుద్ధరించే అధ్యక్ష మెమోరాండమ్‌పై ఆయన సంతకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇరాన్‌తో డీల్‌కు నేను సానుకూలంగానే ఉన్నా. కానీ న్యూక్లియర్ ఒప్పందానికి మాత్రం కాదు. ఆ దేశ నాయకుడితోనూ చర్చలు జరిపేందుకు సుముఖమే. అయితే, అణ్వాయుధాన్ని అందుకోవడంలో టెహ్రాన్ చాలా దగ్గరగా ఉంది. దాన్ని అడ్డుకోవాలి. ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండొద్దు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ చమురు ఎగుమతుల (ఎతీజీని వాతిశ్రీ వలీజూనీతీబిబ)పై కఠిన ఆంక్షలు అమలు చేసే విషయంలో గత బైడెన్ సర్కారు విఫలమైందని ట్రంప్ ఈ సందర్భంగా దుయ్యబట్టారు. బైడెన్ చర్యల వల్ల.. చమురు విక్రయించి ఆ సొమ్ముతో అణ్వాయుధ తయారీ కి నిధులు సమకూర్చుకునేలా టెహ్రాన్‌కు అనుమతులు దక్కాయని మండిపడ్డారు. అయితే, తాజా మెమోలో ఇరాన్‌పై ఎలాంటి ఆంక్షలు ఉండబోతున్నాయన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఇదే సమయంలో టెహ్రాన్‌కు ట్రంప్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. "నన్ను చంపాలని చూస్తే మీ నాశనాన్ని మీరు కోరుకున్నట్లే..! నన్ను హత్య చేస్తే ఇరాన్‌ను సమూలంగా నాశనం చేయాలని ఇప్పటికే నా అడ్వైజర్లకు ఆదేశాలిచ్చా" అని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు.ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్న సమయంలో 2020లో ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ మృతిచెందిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలతోనే అమెరికా దళాలు వైమానిక దాడులు జరిపాయి. అందులోనే సులేమానీ ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటనకు ప్రతీకారంగా టెహ్రాన్.. ట్రంప్‌పై దాడులకు కుట్రలు పన్నుతున్నట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం వెనక ఇరాన్ పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ కరెన్సీకి 'ట్రంప్' దెబ్బ.. డాలరుకు 8.50లక్షల రియాల్స్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలతో అనేక దేశాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇరాన్‌ను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా అణ్వాయుధ తయారీకి సిద్ధమవుతున్న టెహ్రాన్ లక్ష్యంగా ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ఆ దేశ కరెన్సీని చరిత్రలో అత్యల్ప స్థాయికి పతనమయ్యేలా చేశాయి. తాజాగా ఒక అమెరికన్ డాలరుతో పోలిస్తే ఇరాన్ కరెన్సీ 8,50,000 రియాల్స్‌కు పతనమైంది.అణ్వాయుధ తయారీకి సిద్ధమవుతోన్న ఇరాన్‌కు చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ట్రంప్.. ఆ దేశంపై గరిష్ఠ ఒత్తిడి పెంచేలా పావులు కదుపుతున్నారు. ఇరాన్ చమురు ఎగుమతులను పూర్తిగా సున్నాకు తీసుకురావడం.. ఐరాస ఆంక్షల అమలుకు పిలుపునిచ్చారు. అయితే, ఈ ఆంక్షలు విధించడం ఇష్టం లేదని, టెహ్రాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, వీటిపై ట్రంప్ నుంచి అధికారిక సందేశం కోసం ఇరాన్ అధికారులు వేచి చేస్తున్నట్లు సమాచారం.అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అగ్రరాజ్యంతో ఇరాన్ అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32వేల రియాల్స్ ఉండేవి. కొంతకాలంగా భారీగా పతనమవుతూ వస్తోన్న రియాల్ విలువ.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03లక్షలకు చేరుకుంది. తాజాగా అది మరింత పతనమై 8.5లక్షల రియాల్స్‌కు పడిపోయింది.

# దేశానికి ఇది అవమానం



1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని..కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యూఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమవలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.

**అమృత్‌సర్‌లో దిగిన అమెరికా ప్రత్యేక విమానం**

చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 205 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. వీరంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారిగా తెలుస్తోంది. అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు దిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు పక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు తరలించింది.అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

## ఎల్బీనగర్‌లో విషాదం

ఈ క్రమంలో మట్టిదిబ్బలు పడటంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మట్టిదిబ్బల కింద నుంచి మూడు మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే రెండు గంటల పాటు శ్రమించిన తర్వాత అతికష్టం మీద మూడు మృతదేహాలను వెలికితీశారు. మృతి చెందిన ముగ్గురు బీహార్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు వీరయ్య, వాసు, రాములుగా తెలుస్తోంది. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా సెల్లార్‌లో మట్టిదిబ్బలు కూలి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతుల్లో ఇద్దరు తండ్రీ, కొడుకులు ఉన్నట్లు గుర్తించారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో పనిచేసే ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. అయితే సెల్లార్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సెల్లార్ తవ్వే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో పెద్ద ఎత్తున సెల్లార్ కోసం తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో పెద్ద ఎత్తున పేలుళ్లు జరుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోని పరిస్థితి. ఈ సెల్లార్లన్నీ కూడా 40 అడుగుల లోతులో ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్‌దే..

- కాంగ్రెస్ పార్టీలో యూత్‌కు పెద్దపీట
- రేవంత్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో యువజన కాంగ్రెస్ కు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ కు గెలుపు అని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, పట్టభద్రుల ఎమ్మెల్యే పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని ఈఎన్ గార్డెన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన ఆత్మీయ సమ్మేళనంజరిగింది. ఈ యువజన రాష్ట్ర అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి, పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడడమే లక్ష్యంగా యువత కష్ట పడి పని చేయాలనీ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతంగా ముందుకు వెళు ుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఉంటుందని కరీంనగర్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడం శుభపరిణీయమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. నాలుగు నెలల ఎమ్మెల్సీ పర్యటనలో చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటన్నిటిని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తనపై ఉందని గుర్తు చేశారు. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తుందని, తాను రాజకీయాలు చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని కేవలం నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ... అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి కాంగ్రెస్ టికెట్ ప్రకటించగానే ఆయన గెలుపు ఖాయమైందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి నరేందర్ రెడ్డి కి అత్యధిక మెజార్టీ ఇస్తామని వెల్లడించారు. రానున్న 20 రోజుల్లో ప్రతి యువజన కార్యకర్త ఒక్కొకరు 200 ఓట్లు వేయించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అవినాష్ గౌడ్ వెంకటేష్, ముత్యం శంకర్, బీరం రాజేష్ గుర్రం వాసు, మునిగంటి అనిల్, ఫహద్, బండి కిషన్ రెడ్డి, ఆంక్ష రెడ్డి, జెరిపోతుల వాసు తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి చేస్తాం

- ప్రజాఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం
- స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలో వామపక్ష ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామనీ, అయితే, వామపక్ష పార్టీలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని నొక్కి చెప్పారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తామనీ, ధన, మద్య ప్రలోభాల రాజకీయాలను తిప్పికొడతామని చెప్పారు. కేంద్రంలోని మోడీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్ అని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోడీ సర్కారు మాత్రం ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఆ రెండు రంగాలకు కేవలం 4 శాతం నిధులే కేటాయించడం దానికి నిదర్శనమని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి టీడబ్ల్యూజేఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్.ఎస్.హష్మీ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, సలీమా, గుడిగ రఘు, హెచ్‌యూజే అధ్యక్షులు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బి.జగదీశ్, కోశాధికారి రాజశేఖర్, నాయకులు విజయ, తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదనీ, ఫలితంగానే ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల చేతిలో 27 శాతం సంపద పోగైందని చెప్పారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయల సంపదను అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో 50 శాతం ఉన్న పేదల చేతుల్లో కేవలం 13 శాతం సంపదే ఉందని చెప్పారు. దీంతో పేదలు రక్తహీనత, పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం, ఇండ్లలేమి వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మన దేశంలో ఈ అసమానతలు గత పాలకులు, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్లనే అన్నారు.

మతోన్మాద రాజకీయాలు శ్రామిక వర్గ ఐక్యతకు, సామాజిక ఉద్యమాలకు, బడుగు, బలహీన వర్గాల పోరాటాలకు తీవ్ర ఆటంకంగా మారాయని వాపోయారు. ఈ తరుణంలో దేశంలోని లౌకిక శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. 50 లక్షల 60 వేల కోట్ల రూపాయల దేశ బడ్జెట్‌లో 30 కోట్ల మంది ఉపాధి కూలీలకురూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని కోరితే కేవలం 85 వేల కోట్ల రూపాయలను మాత్రమే ఇచ్చిన మోడీ సర్కారును పేదల వ్యతిరేక ప్రభుత్వమని కాకుండా ఇంకేమని అనాలని ప్రశ్నించారు. దేశ జనాభాలో 16 శాతం ఉన్న దళితులకు కేవలం ఐదు శాతం, ఏడు శాతమున్న ఎస్టీలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో 50 శాతానికిపైగా జనాభాగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవన్నారు. మూడు, నాలుగు వేల కోట్ల రూపాయలతో మైనార్టీ సంక్షేమం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలపై తన వైఖరేంటో చెప్పకుండా అవకాశవాదంతో ముందుకెళ్తున్నదని విమర్శించారు. సీపీఐ(ఎం) పార్టీ విస్తరించడానికి బలమైన ఉద్యమాలే కీలకం కాబోతున్నాయన్నారు. విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. వామపక్ష పార్టీలను కలుపుకుని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు సీపీఐ(ఎం)గా చొరవ తీసుకుంటామని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్రంగానే పోటీచేస్తామనీ, అదే సమయంలో సీపీఐ, ఇతర వామపక్షాలు బలంగా ఉన్న చోట్ల పరస్పర సహకారంతో ముందుకెళ్తామని ప్రకటించారు.

# కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు పోరాడుదాం

- రైతు, కార్మిక సంఘాల నాయకులు
- హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా




**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను సవరించే వరకు ఐక్యంగా ఉద్యమిద్దామని హైదరాబాదులోని అంబేద్కర్ విగ్రహం దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో జరుగు నిరసనలలో భాగంగా ధర్నా కార్యక్రమం జరిగింది. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్ ను సవరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దని,ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత విధించొద్దని, రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదాను రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టీ సాగర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, ఎఐటియుసి నాయకులు ప్రేమ్ పావని ,ఐఎన్ టి యు సి నాయకులు నాగన్న గౌడ్, బి.ఆర్.ఎస్.కె.వి నాయకులు రాంబాబు, టి యు సి ఐ నాయకులు సూర్యం, ఐఎఫ్టియు నాయకులు ఎం శ్రీనివాస్, యు టి యు సి నాయకులు భరత్, రైతు సంఘాల నాయకులు మామిడాల బిక్షపతి, భాస్కర్ లు మాట్లాడుతూ.... 2025-26 కేంద్ర బడ్జెట్‌ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయం అని అన్నారు. విభజన హామీ చట్టంలోని అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 11 సం?ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం మోసం. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత అని చెప్పి బడ్జెట్ కేటాయింపులు ప్రకటించకుండా రైతాంగాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి మోసగించింది. రైతు ఋణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపును విస్మరించింది. విద్యుత్‌రంగం సంస్కరణలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని కలగనుందని తెలిపారు. స్థూలంగా 10 సంవత్సరాల బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతనిచ్చి ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను సవరించే వరకు ఐక్యంగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేష్, జయలక్ష్మి, ఈశ్వరరావు, కూరపాటి రమేష్, పద్మశ్రీ, రైతు సంఘం నాయకులు సంధ్య, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పని పద్మ, కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

- ఇద్దరికీ స్వల్ప గాయాలు



**గణపురం ,ఫిబ్రవరి 05 ( జనం సాక్షి ):** మండలంలోని పరుశురాంపల్లి సమీపంలోని ఓసి త్రీ చెక్ పోస్ట్ ఆవరణలో బుధవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలో రవి నగర్ గ్రామానికి చెందిన బస్వాజి రామాచారి (42) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ రేఖ అశోక్ కథనం ప్రకారం కాంట్రాక్టు పని నిమిత్తం ట్రాక్టర్ లో పదిమంది కూలీలు పని పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో ఓసి త్రీ చెక్పోస్ట్ దాటిన అనంతరం కొద్ది దూరం వచ్చాక డ్రైవర్ కు ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు క్రింద పడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన కూలీలు ట్రాలీ నుండి దూకి ప్రాణాలు రక్షించుకోగా ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ కు ఛాతి పుట్ట భాగంలో బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గణపురం ఎస్ఐ రేఖ అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి దారి తీసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడు రామాచారికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు ఉన్నారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కేంద్రమంత్రుల వ్యాఖ్యలు దారుణం

- నిరసన తెలిపిన కేరళ ఎంపిలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కేరళను నిరంతరం ఎగతాళి చేస్తున్న కేంద్ర సహాయ మంత్రులు సురేష్ గోపి, జార్జ్ కురియన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రానికి కి చెందిన వామపక్ష ఎంపీలు పార్లమెంటు ముందు నిరసన తెలిపారు. సురేష్ గోపి, జార్జ్ కురియన్ రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేయడానికి ఇష్టపడకపోతే, ఆయనను మంత్రిత్వ శాఖ నుండి తొలగించాలి. సీపీఐ-ఎం లోక్ సభ నాయకుడు కె. రాధాకృష్ణన్, రాజ్య సభ ఉప నాయకుడు జాన్ బ్రిట్టాస్ నిరసనకు నాయకత్వం వహించారు. గిరిజన సంక్షేమ శాఖను అగ్రవర్ణాలకు ఇవ్వాలన్న సురేష్ గోపి వ్యాఖ్యను కూడా వామపక్ష ఎంపీలు నిరసించారు. కేరళ తరపున మాట్లాడాల్సిన కేంద్ర మంత్రులు నిరంతరం కేరళను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కె.రాధాకృష్ణన్ అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలహీన పరిచే ప్రణాళికాబద్ధమైన చర్యలో కేరళకు చెందిన కేంద్ర మంత్రులు కుట్ర పన్నుతున్నారు. సురేష్ గోపి వ్యాఖ్య రాజ్యాంగ విరుద్ధమని రాజీనామా చేయాలని రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు.

# గచ్చీబౌలిలో బెంగాలీ యువతి ఆత్మహత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** హాస్టల్ భవనం పై నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదం సంఘటన సిటిలోని గచ్చిబౌలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రితోజీ బసు (22) అనే యువతి.. గచ్చిబౌలి సిద్ధిక్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటోంది. బుధవారం హాస్టల్ బిల్డింగ్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హైదరాబాద్ శివారులో అగ్ని ప్రమాదం



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** హైదరాబాద్ శివారులోని చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మొదట శేషసాయి కెమికల్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే ఆ మంటలు పక్కనే ఉన్న మహాలక్ష్మి రబ్బర్ కంపెనీకి విస్తరించాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. రసాయన పరిశ్రమలో మంటలు అంటుకోవడంతో అక్కడున్న కెమికల్ డ్రమ్ములు పేలిపోయాయి. దీంతో మంటలు ఫ్యాక్టరీలో భారీగా ఎగసిపడుతున్నాయి.మంటల ధాటికి ఫ్యాక్టరీలో ఉన్న రసాయన డ్రమ్ములు పేలిపోతున్నాయి. అగ్నిప్రమాద ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. రసాయనాల నుంచి వచ్చే ఘాటైన పొగతో చర్లపల్లిలోని కెమికల్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దట్టమైన పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరై పరుగులు తీశారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదం సంబవించడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించిన తెలంగాణ

- మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** షెడ్యూల్డ్ కులాలను ఉపవర్గీకరించేందుకు రాష్ట్రాలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణను పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎస్సీ వర్గాల మధ్య సమానమైన రిజర్వేషన్ల పంపిణీని నిర్ధారించే లక్ష్యంతో దీర్ఘకాలంగా పెండిరగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను ఎట్టకేలకు మంత్రివర్గ ఉపసంఘం పరిష్కరించిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ దూరదృష్టి నిబద్ధతతో తెలంగాణ నిజమైన సామాజిక న్యాయం దిశగా ముందడుగు వేస్తున్నది అన్నారు. ఈ మైలురాయి సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాలను ఉద్ధరిస్తూ మరింత సమగ్రమైన, న్యాయమైన వ్యవస్థకు మార్గం సుగమం చేస్తుందని, ఇదితెలంగాణకు గర్వకారణం అని కొనియాడారు.

# 200 దేశీదారు బాటిళ్లు స్వాధీనం



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 5 (జనం సాక్షి) :** మద్యం అక్రమ విక్రయాలు జరిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు కాగజ్ నగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి అన్నారు. బుధవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో అక్రమంగా మద్యం తరలిస్తూ, విక్రయిస్తున్న పలువురుపై కేసులు నమోదు చేశారు. మహారాష్ట్ర నుంచి దేశోద్ధార బాటిల్లు (200)ను తీసుకువచ్చి విక్రయిస్తున్న ఎనం రాజు ,తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు రత్నం శ్రీకాంత్, ఒగ్గు దివాకర్ అనే వ్యక్తులు అక్రమంగా పట్టణంలో ని జై భీమ్ కాలనీలో ఆఫీసర్ ఛాయిస్ (45) బాటిల్లు, రాయల్ స్టాగ్ విస్కీ (31) బాటిల్లు, మరో 76 డీకే విస్కీ బాటిల్ల మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు పి. లోబానంద్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

**బోథ్ ఫిబ్రవరి 05(జనంసాక్షి) :** ఓ ఉపాధ్యాయుడు పాఠశాలలోనే గుండెపోటుతో మృతి చెందిన ఘటన బోథ్ లో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోనీ మోడల్ స్కూల్ లో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడి గా విధులు నిర్వహిస్తున్న దేవరాజు (40) సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందారు. సహచర ఉపాధ్యాయులు విద్యార్థులు మృతదేహాన్ని సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



# అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచుల అరెస్ట్

**చెన్నారావుపేట, ఫిబ్రవరి 5 (జనం సాక్షి):** అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా మాజీ సర్పంచ్ లను చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం తమ పెండింగ్ లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉండడంతో ఆ కార్యక్రమానికి వెళ్లకుండా సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు, చెన్నారావుపేట మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, ఖాదర్ పేట మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి లను ముందస్తుగా అరెస్టు చేశారు. ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్న సర్పంచుల బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

# పత్తి రైతుల నిరసన



**చెన్నూర్ ,ఫిబ్రవరి, 5 (జనం సాక్షి) :** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు పత్తి రైతులు నిరసన చేపట్టారు. పత్తిని కొనుగోలు చేయకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు జాప్యం చేస్తున్నారని కార్యాలయం ముందున్న జాతీయ రహదారిపై కూర్చొని ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మకానికి వచ్చిన ప్రతి పత్తి వాహనానికి టోకెన్లు ఇచ్చి పత్తి కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఈ నిరసన కార్యక్రమంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి, సంబంధిత అధికారులు తమ గోడును పట్టించుకోని దళారుల బారినండి కాపాడడానికి పత్తి కొనుగోలు తక్షణమే చేపట్టాలని రైతులు కోరారు.

**PUBLIC NOTICE**

**TO WHOM SO EVER IT MAY CONCERN,**

My client Md. Najeeb and Md. Nadeem R/o H. No. 17-13, Allipur (V), Zaheerabad (M), Sangareddy (D) filed suit against Defendant Mohammed Akhil S/o Sadak Ali R/o H.NO 4-1-88, Basaweshwara Street, Zaheerabad (T) Sangareddy (D), for Declaration of Title and Perpetual Injunction over Agricultural land bearing Sy. No. 34/ to an extent of Ac. 0.08 gts Situated at Zaheerabad (T) & (M), Sangareddy (D) basingon Registered Settlement Deed vide No. 5394 of 2018 dated 26-5-2018. The case is pending before Hon'ble JUNIOR CIVIL JUDGE at Zaheerabad vide O.S No. 525 of 2023. It is learnt that Defendant is trying to alienate Suit Schedule Land by concealing fact of pendency of dispute before Court of Law with intention to cause loss to my clients. Hence General Public are here by Cautioned not to enter into any type of agreement with Defendant over above said land during pendency of Suit before Court of Law and all such agreements and deeds would be illegal and not valid under Law.

Sd /-
**P. SAMARA SIMHA REDDY,**
**Advocate,**
**Sanga Reddy. Cell;9912382345**

జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 6 ఫిబ్రవరి 2025 తెలంగాణ



అమెరికాలో 7.5 లక్షల మంది ఇండియన్స్ అక్రమంగా ఉంటున్నారు అని లెక్కలు చెబుతున్నాయి.25,000 మంది ని దాదాపు అక్కడి నిఘా విభాగం అదుపులో పెట్టారు. చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్న వారిలో 90 శాతం మంది ఉద్యోగాలు మానేశారు. ఉద్యోగాలు చేస్తున్న వారి ఆరా తీసే పనిలో అక్కడి ఇంటలీజెన్స్ వర్గాలు ఉన్నాయి. ఇందులో 18,000 మందిని ఇండియాకు వాపసుపంపుతున్నారు.

# స్వదేశంకు వస్తున్న వారికి చేయూతందేనా?

అమెరికా నుంచి 205 మందిని మొదటి విడతగా పంపారు. మొత్తంగా అందరినీ వాపసు పంపే ప్రక్రియను అమెరికా వేగవంతం చేసినట్లు కనిపిస్తున్నది. 2.5 లక్షల మంది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భయానికి ఉపాధి మానేసి, అక్రమంగా అమెరికాలోకి వచ్చిన పరిస్థితి నుంచి బయట పడడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలో అక్కడి పౌరసత్వం, అదే గ్రీన్ కార్డు పొందిన వారు మినహా ఎవరు కూడ ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించడం లేదు.

**వాపసు వస్తున్న వారి కోసం?**

భారతదేశంకు ఏకా ఎకిన వాపసు వస్తున్న, అమెరికా వాపసు పంపిస్తున్న వారి పరిస్థితి ఏమిటి? వారికి ఇక్కడ ఉద్యోగం ఎలాగూ దొరకదు!అది లేకే కదా అంత దూరం ఆస్తులు అమ్మి, అప్పులు చేసి వెళ్ళింది! కాబట్టి ఉద్యోగం దొరకదు!ప్రశాంతంగా ఇబ్బంది లేకుండా, ఇల్లీగల్ గా ఎలా వెళ్లారు? ఎవరు పంపారు? పాస్పోర్ట్ల జప్తు! కేసులు వగైరా లేకుండా ప్రశాంతంగా ఉండే పరిస్థితి ఉంటుందా! చూడాలి!దేశంలో అధికారంలో ఉన్న, బీజేపీ, ఎన్డిఎ ప్రభుత్వం ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఆశలు చూపి 2014 నుంచి మూడో సారి అధికారంలోకి వచ్చింది. పీఎం నరేంద్ర మోడీ దేశంలోని నిరుద్యోగులకు ఇచ్చిన ఈ హామీ ప్రకారం 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి! కానీ కనీసం కోటి ఉద్యోగాలు కూడ ఇవ్వలేదు.

**40 కోట్లకు పైగానే నిరుద్యోగులు!**

దేశంలో ఉపాధి లేని వారు 40 కోట్లకు పైగానే ఉన్నారు. కనీస సంపాదన పది వేలు లేని కుటుంబాలు కోట్లలో ఉన్నాయి. ఇక అధిక ధరలు తగ్గే పరిస్థితి లేదు. 2023 లో పార్లమెంట్ లో పీఎం మోడీ ప్రకటించిన 10 లక్షల ప్రభుత్వ ఖాళీల భర్తీ ఇంకా జరుగలేదు. పేపర్ లీకులు అలాగే కొన సాగుతున్నాయి. కొత్తగా పరిశ్రమలు రావడం లేదు. 25 కోట్ల మంది ని పేదరికం నుంచి బయటికి తెచ్చాము అంటారు, పీఎం మోడీ!80 కోట్ల మంది పేదలకు కి మూడు ఏండ్లుగా ఇస్తున్న 5 కేజీ ల ఉచిత రేషన్ గడువును పెంచుకుంటూ పోతున్నారు. యువత కు ఉద్యోగాల సృష్టి, దేశంలో పారిశ్రామిక ప్రగతి, ప్రొడక్షన్ ను పెంచి ఎగుమతులను పెంచుకోవడం లాంటి ప్రధాన విషయాల మీద అసలు దృష్టి లేదు.

**బతుకు బండి లాగడానికే విదేశాలకు!**

ఈ పరిస్థితి లో విదేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ పని చేసుకుంటూ, కుటుంబాలకు దూరంగా ఉండి, కాస్తో, కూస్తో సంపాదించి ఇంటికి పంపిస్తూ, బతుకు బండి లాగుతున్న వారి పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉన్నది. అమెరికా సహా ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనెడా, సింగపూర్, మలేషియా, రష్యా, ఇజ్రాయిల్, దుబాయ్, క్వాయిత్, రియాద్,ఒమాన్ ఇలా (యుఎఈ) లలో, అటు దక్షిణాఫ్రికా లో ను ఇండియన్స్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక్కో దేశంలో ఒక్కో రకం ఇబ్బందులను ఎదురుకుంటున్నారు. కళ్ళవెల్లి అవుతున్నారు. భారీగా బ్రోకర్ల చేతుల్లో మోసపోతున్నారు. చాలా దీనమైన పరిస్థితులను వారు ఎదురుకుంటున్నారు. 11 మిలయన్లకు పైగా నే విదేశాలనుంచి వచ్చిన వారు అమెరికాలో ఉంటున్నారు. ప్రపంచంలో ఎక్కడ కూడ మనవాళ్ళు కష్టపడకుండా, పని చేయకుండా డబ్బులు సంపాదించడం లేదు. మంచి స్కిల్స్ తోనే, ఎడ్యుకేషన్ తోనే మనవాళ్ళు వెళుతున్నారు. చివరికి లేబర్ పనికి వెళుతున్న వారు కూడ నైపుణ్యం తోనే ఉంటున్నారు. అలాంటి వారికి మన దేశంలో ఉపాధి లేనికారణంగా విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. అందుకే వెళుతున్నారు. అమెరికాకు కూడ అంతే! నిజానికి అమెరికా కు వెలుతున్న వారి వల్ల ఆ దేశానికీ ఎంతో లాభం చేకూరుతున్నది. దాదాపు లక్ష కోట్ల ప్రయోజనం అటు అమెరికాకు, ఇండియా కు కూడ కలుగు తున్నది.

**మోడీ మనవాళ్ళను కలవాలి!**



ఈ నేపద్యంలో ఇప్పుడు అక్కడి నుంచి ఎంతో అవమానకరంగా మన దేశానికీ మనవాళ్ళను ఇల్లీగల్ పేరిట వాపసు పంపుతున్న తీరు ఏమీ బాగోలేదు!ఈనెల 13 న మన పీఎం నరేంద్ర మోడీ అమెరికాలో అక్కడి రాష్ట్రపతి డోనాల్డ్ ట్రంప్ తో సమావేశం అవుతున్నారు, అంటున్నారు. అప్పుడు మనవాళ్ల సంగతి చర్చించాలి. మన వాళ్లలో భయాందోళనలను దూరం చేసి, వారిలో ఉన్న అభద్రత భావం ను దూరం చేయాలి. వీలు అయితే మన వాళ్ళను మన పీఎం కలిసి మాట్లాడాలి. వారికి ధైర్యం చెప్పాలి. నేను ఉన్నాను అనే నమ్మకం కలిగించాలి.గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చూపిన చొరవను చూపాలి! వాపసు దేశానికీ వచ్చేస్తున్న వారికి (ఒకరకంగా తరమ బడుతున్న వారికి స్వదేశం లో భద్రత కల్పించాలి, ఉపాధి కి అవకాశం కల్పించాలి )



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# మరణశిక్ష విధానం నేటికీ అవసరమేనా!



ప్రాచీన కాలం నుండి రాచరిక వ్యవస్థ వరకు, మరియు మధ్య యుగం నుండి నేటి ఆధునిక కాలం వరకు రాజ్యంలో న్యాయ వ్యవస్థ లో వివిధ రకాలుగా ఆ రోజుల్లో నేరస్తులను ఆయా కాలాలకు అనుగుణంగా తీర్పులు ఇచ్చి శిక్షలు విధించేవారు, మధ్యయుగ కాలం నాటి విధానం అంటే 'పంటికి పన్ను కంటికి కన్ను" అనే విధానం నేటికీ మన దేశ న్యాయ వ్యవస్థ కొనసాగిస్తూనే ఉంది అని చెప్పాలి, ఎందుకంటే మన దేశంలో ఇంకా మరణ శిక్ష నిషేధించలేదు కాబట్టి, నేటి ఆధునిక కాలంలో కూడా మరణ శిక్ష మన దేశంలో అవసరమేనా అనేది చూద్దాం.

**చట్టం ప్రకారం:**

మన దేశ న్యాయ వ్యవస్థ లో తప్పు చేస్తే దండించడానికి చట్టాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది, భారత దేశంలో బ్రిటిష్ వాళ్ళు పాలిస్తున్న రోజుల్లో వారు కొన్ని క్రిమినల్ చట్టాలు చేయడం జరిగింది, అందులో ఇండియన్ పీనల్ కోడ్ 1860 (భారతీయ న్యాయ సంహిత 2023) ప్రకారం ఎవరైనా తప్పు చేస్తే కేసులు నమోదు చేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం 1973 (భారతీయ నాగరిక్ సురక్ష్ సంహిత 2023) ఆయా తప్పులకు శిక్షలు విధించడం జరు గుతుంది, అయితే ఇందులో కూడా కొన్ని కేసులకు మాత్రమే మరణ శిక్ష విధించే అవకాశం ఉంటుంది అందులో చూస్తే సెక్షన్స్, 120B ,121, 132, 194, 302, 303, 305, 354A, 376A, అలాగే 31ఏ నార్కోటిక్స్ డ్రగ్స్ వంటి చట్టాల్లో కూడా శిక్షలు విధించే అవకాశం ఉంది,

**నేటికీ మరణ శిక్ష అవసరమా:**

వాస్తవానికి మరణ శిక్ష అన్నీ నేరాలకు లేదు, కొన్ని నేరాలకు మాత్రమే ఉంది, మరణ శిక్ష విధించడం వల్ల కొన్ని నేరాలు తగ్గుతాయో అని న్యాయ వ్యవస్థ మరియు ప్రజలు నమ్ముతా రు, అయితే గతంలో మనం చూశాం డిల్లీలోలో జరిగిన నిర్భయ కేసు లో వాళ్లకు శిక్ష ఖరారు చేసిన వెంటనే మరో పక్క తెలంగాణ లో దిశ అనే రేప్ కేసు నమోదు అయ్యి అతి కిరాతకంగా చంపారు, వాళ్ళను పోలిసులు ఎన్కౌంటర్ లో చంపేయడం జరిగింది, అయితే ఇటీవల కాలంలో కూడా బెంగాల్ లో మెడికల్ విద్యార్థి పైన కూడా రేప్ చేసి మరి చంపిన ఘటన మనం చూసాం, ఇలా చెప్పుకుంటూ పోతే దేశ వ్యాప్తంగా చాలనే ఉన్నాయి, అయితే మరణ శిక్ష విధించిన మాత్రాన మరుతున్నారా అంటే ఎలాగూ మారారు, మరణ శిక్ష కంటే యావజ్జీవ కారాగార శిక్ష విధించే విధానం చేయాలి, వాస్తవానికి " పన్నుకు పన్ను కన్ను కు కన్ను " అనే విధానానికి చెక్ పెట్టాలి, మరణ శిక్ష వల్ల "మానవ హక్కులు" మరియు "జీవించే హక్కు" భారత రాజ్యాంగం ప్రకారం విరుద్ధం అని చాలా మంది మానవ హక్కుల కార్యకర్తలు, దేశంలో ఎంతోమంది న్యాయ నిపుణు లు, మేధావులు, వంటి ఎందరో కూడా మరణ శిక్షకు వ్యతిరేకంగా విభేదించారు. అదేవిధంగా ప్రభుత్వాలు కూడా కొన్ని సంస్కరణలు చేయాలి అని తెలిపింది, అందులో పోలీస్ సంస్కరణలు, సాక్షి భద్రత పథకాలు, బాధితులకు నష్ట పరిహారం వంటివి తేవాలని సూచించింది, అయితే సుప్రీం కోర్టు కూడా అతి కొద్ది కేసులకు మాత్రమే శిక్షను ఖరారు చేయాలని చెప్పింది, అయితే కమిషను సైతం మరణ శిక్ష రద్దు పై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను తో చర్చించి నిర్ణయం తీసుకోవాలి అని గతంలో తెలిపింది,ఇది ఇది జీవించే హక్కుకు విరుద్ధం అని తెలిపింది.

**ప్రపంచ దేశాలలో :**

ప్రపంచ దేశాలలో చూస్తే 1960 దశకంలో "ఇంటర్నేషనల్ కోవేనేంట్ సివిల్ మరియు పొలిటికల్ రైట్స్" వంటి సంస్థ మరణ శిక్ష రద్దు చేయడం గురించి గ్లోబల్ లెవల్ లో ప్రయత్నాలు చేస్తూనే ఉంది, యునైటెడ్ జనరల్ అసెంబ్లీ ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల రక్షణ కొరకు 2007 నుండి 2018 వరకు రిజల్యూషన్ తీసుకుంటేనే ఉంది, అయితే 2007లో యూఎన్లో కూడా భారత్ మరియు మిగతా కొన్ని దేశాలు ఇంకా రద్దు చేయలేదు, ఇందులో అమెరికా కూడా ఉంది. అంటే దాదాపు ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 70 శాతం మేర మరణ శిక్షను రద్దు చేయడం జరిగింది, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2020 ప్రకారం 108 దేశాలు అన్నీ శిక్షల్లో మరణ శిక్ష ను రద్దు చేయడం జరిగింది అని తెలిపింది. గత పదేళ్లుగా 28 దేశాలు వాస్తవానికి రద్దు చేశాయి కానీ ఇంకా అవి అమలు చేయడం లేదని తెలి పింది. ఇంకా 55 దేశాలు తేలికపాటి కేసులకు సైతం మర ణ శిక్ష విధించడం జరుగుతుంది. అయితే మరణ శిక్ష విధిస్తున్న దేశాలలో ఇండియా, చైనా, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, సౌత్ కొరియా, ఇరాన్, జపాన్, శ్రీలంక, తైవాన్, అమెరికా, ఇథియోపియా, నైజీరియా, వంటి దేశాలు ఉన్నాయి.

**ప్రత్యామ్నాయం వెతకాలి:**

నిజానికి మరణ శిక్ష అంతిమ శిక్ష కాదు, అయితే నేరం చేసిన వ్యక్తులకు జీవితాంతం కఠిన కారాగార శిక్ష విధించి ఎలాంటి "పెరోల్" వంటివి వినియోగించకుండా పెట్టాలి, అతని సహజ మరణం పొందే వరకు అక్కడే ఉంచాలి, అయి తే అదేవిధంగా నేరస్థులకు మార్చే ప్రయత్నం చేయాలి, నేరస్తులను వారి వారి వృత్తుల రీత్యా వాడుకొని వాళ్లు మంచిగా అయ్యే అవకాశాలు కల్పించాలి, శిక్షను పొడిగిస్తూ ఉండాలి, ఎలాంటి అవకాశం లేకుండా "హినియస్" లాంటి కేసుల్లో మాత్రమే శిక్షను ఖరారు చేయాలి. కొన్ని ఏళ్ల నుండి వస్తున్న మరణ శిక్షకు బదులు యావజ్జీవ శిక్షను చేర్చాలి, టెర్రరిజం వంటి కేసుల్లో మరణ శిక్షను విధించే విధంగా చేయాలి, కొన్ని కేసుల్లో మాత్రమే మరణ శిక్ష ను విధించాలి, మిగత్ వాటికి వేరే ప్రత్యామ్నాయం వెతకాలి, దీనిపై ప్రభుత్వం, మేధావులు, న్యాయ నిపుణులు, ప్రజలు, అందరూ చర్చించాలి, మరణ శిక్ష కు బదులు యావజ్జీవ కారాగార శిక్షను విధించే విధంగా చేయాలి అని కోరుకుందాం!



కిరణ్ ఫిషర్
అడ్వకేట్, సిటిజెన్ రైట్స్ ఫోరం
సెల్: 7989381219

## చచ్చి మీ కులానికే పుడతాం!

మా దళిత జీవితాలు చరిత్రకు
ఎక్కాలంటే:
తరతరాలుగా మాపై జరుగుతున్న
ఆగడాలకీ,అఘాయిత్యాలకీ,
అణచివేతలకీ,
మేము ఉరి కొయ్యలెక్కి మీ ముందే
ఉరేసుకొని చావాలి
తీసుకున్న అప్పు తిరిగి కట్టలేదని,
మీ అగ్రకుల మూకలు మాపై రక్కుతూ
బలాత్కారమాడాలి!
మీ జాతి స్త్రీలను ప్రేమించామన్న
నెపంతో,
మా కళ్ళు పీకి,
మా మర్మాంగాలను కోసి చంపాలి!
మా తలలను తెగ నరుకాలి!
తెలీక మీ పవిత్ర ప్రదేశాల్లోకి
చొరబడ్డామని,
మీ పూల పాన్పుల్ని తాకామని,
ముక్కుపచ్చలారని మమ్మల్ని,
మీ దౌష్ట్యానికి బలి చేయాలి!

మమ్మల్ని అన్ని విధాలా దోచుకోండి
నగ్నంగా నడి వీధుల్లో తిప్పండి
ఆ నగరపు నడి బొడ్డునే ఖననం
చేయండి
సామూహిక దాడులు జరిపి, ఉత్సవంలా
ఊచ కోతలు కోయండి
నరహత్యా పాతకాలేవీ మిమ్ముల
చుట్టుకోవు
మమ్మల్ని నాశనం చేసినందుకు గాను,
పెద్దపెద్ద అవార్డులు మీకై
ఎదురుచూస్తున్నాయి
మా జీవితాల్ని బుగ్గిపాలు చేసినందుకు
గాను,
మమ్ముల శాసించే అధికారాలు మిమ్ముల
అందలమెక్కిస్తాయి
మేం బానిసలుగా ఉన్నంతకాలం,
మమ్మల్ని చంపే అవసరం మీకెక్కడిది?
మేం తిరగబడితేనే కదా మీరిన్ని చేసేదీ!?

మీరు అణుస్తున్నంత కాలం,
విదిలించుకుని తిరగబడుతూనే ఉంటాం!

బడి, గుడి, మా వాడ, మీ వీధి,
ఎక్కడైనా మేము అంటరానివాళ్లమే!
మా బతుకులన్నీ అణగారిన అస్థి
పంజరాలే!

మీరు మా కళ్లల్లో కారం కొట్టి,
మా నోటికి నీరు అందిస్తరు!
మా జీవితాలను మురికి చేసి,
ఆపై మూత్రాభిషేకం చేస్తరు!

మా స్త్రీలను నమ్మించి, మోసగించి,
ఆత్మహత్యలకే అర్పిస్తున్నరు!
చీకట్ల గొంతునులిమి,
మా బతుకు దివిటీని ఆర్పుతున్నరు!

ఇట్లైనా మా జీవితాలు చరిత్రకి
ఎక్కుతాయంటారా?
ఎక్కకపోతే,
ఈ పవిత్ర దేశంలో దళితులుగా
పుట్టినందుకు,
శిక్షల్ని ఇంకా తీవ్రతరం చేయండి!

చచ్చి మీ కులానికే పుడతాం!
మీ రంగుని మా పేయంతా
పులుముకుంటాం!

లేకుంటే,
మా దళిత జీవితాల్లో మళ్లీ పువ్వులై
విరబూస్తాం!
మీ అణచివేతనీ,
కమ్మ కత్తులై తెగ నరుకుతాం!



-బాలాజీ పోతుల
balaji.pothula333@gmail.com

## కవితాసుందరి

ఆమెకు
అక్షరమే ఆయుధము
ప్రాసలే ప్రాణము

ఆమెకు
పోలికయే భూషణము
శైలే ఆలవాలము

ఆమెకు
ఆలోచనలే ఆధారము
విషయమే ప్రధానము

ఆమెకు
మదులుదోచటమే ముఖ్యము
నిత్యప్రవాహమే ఇష్టము

ఆమెకు
మధురగళాలే ఆవాసము
నవ్వులుచిందించటమే ఆశయము

ఆమెకు
తీపినందించటమే సంతోషము
అందాలుచూపించటమే
ఆనందము

ఆమె
కలాల ప్రవాహము
కాగితాలకు అలంకారము

ఆమె
ఆకర్షణకు ఆద్యము
మరోలోకానికి మార్గము



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

## మాలిన్యం చేరి మరకలు మిగిలే..

ఆకలి ఆలోచనలను చంపుతుంది
శరీరం మెల్లమెల్లగా కృశిస్తుంది
మనసు వేదనతో కన్నీరు కారుస్తోంది
భావోద్రేకాలతో అక్షరమై వర్షిస్తుంది..

బీడు వారిన నేల బిక్కుబిక్కుమంటూ
నెర్రెలు చీలి ఆకాశాన్ని చూస్తూనే
కన్నీరు మున్నీరై విలపిస్తుంది
వసంతపు చినుకులకై
ఎదురుచూస్తుంది..

కార్చిన కన్నీరు సముద్రంలో కలిసే
ఉపయోగము లేని ఉప్పు నీటిలో నిలిచే
ఒడిసిపట్టే చేతులు దూరం జరిగే
మత్స్యకారుల జీవితంలా సుడులు
తిరిగే..

ఆశలన్నీ ఎండిపోయిన మనస్సులో
పాడుబడ్డ బావిలా చెత్త చేరే నిండే
కాలగమనంలో మంచినీళ్లు దొరకక
మాలిన్యం చేరి మరకలు మిగిలే..

సగము కుండలాంటి బ్రతుకులో
పూర్ణత లేక నిలువునా పగిలిపోతుంది

విషవలయం చట్రంలో చిక్కుకున్న
మనిషి
సాలెగూడు లాంటి ఆలోచనలతో
తిరుగుతుండు.


ఎండిన ఇస్తరాకులాంటి మనస్సుకు
పచ్చని విజ్ఞానపు కూరలు వడ్డిస్తే
మస్తిష్కము నిండి మనసు శాంతపడి
సమాజపు గ్రంథ వాసనలు
అనుభవించును..

కొప్పుల ప్రసాద్
నంద్యాల
9885066235

# రామచంద్రామృతం

విద్య వ్యాపారమై గురు శిష్య సంబంధాలు నామమాత్రమైన తరుణంలో ఎప్పుడో దశాబ్దాల క్రితం తమకు పాఠాలు చెప్పిన గురువును గుర్తుంచుకోవడం గొప్ప విషయం. ఆలేరు లో నెలకొన్న సి.ఎస్.ఐ ఉన్నత పాఠశాలకు 120 ఏళ్ల చరిత్ర ఉన్నది. ఇందులో చదువుకున్న అనేకమంది విద్యార్థులు వివిధ రంగాలలో రాణించి దేశానికి సేవలు చేశారు. అలాగే అందులో పని చేసిన అనేకమంది ఉపాధ్యాయులు కూడా తర్వాతి కాలంలో వివిధ చోట్ల ఉన్నత హోదాలలో అనేక రంగాలకు తమ సేవలను అందించారు. అలా 1972 నుంచి 2002 వరకు మూడు దశాబ్దాలుగా అదే పాఠశాలలో తెలుగు పండితులుగా విధుల్ని నిర్వహించి అనేకమంది విద్యార్థుల ప్రేమాభిమానాలను పొంది వారిని మానవీయ విలువలు గల ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన ఆదర్శ ఉపాధ్యాయులు డాక్టర్ లింగంపల్లి రామచంద్ర గారు. ఒకనాడు అక్కడ కనీస వసతి సదుపాయాలు లేని ఆ గ్రామంలోనే పాఠశాల పక్కనే తన శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని అటు విద్యార్థులకు ఇటు గ్రామస్తులకు ఉత్తమ సేవలు అందించిన మహనీయులు రామచంద్ర గారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పండితుడిగా చేరిన ప్రాచార్యుల స్థాయికి ఎదిగిన ఉత్తమ సాహితీవేత్త డాక్టర్ లింగంపల్లి రామచంద్ర గారు. ఆయన కవి, పండితుడు, విమర్శకుడు, పరిశోధకుడు, చరిత్రకారుడు, ఉపన్యాసకుడు, అన్నింటికీ మించి ఆదర్శ అధ్యాపకుడు అలాగే మూర్తీభవించిన మానవతా రూపానికి ప్రతిరూపం. వాల్మీకి రామాయణంలో చెప్పినట్లుగా శ్రీరాముని గుణగణాలన్నీ అందిపుచ్చుకున్నారంటే అతిశయోక్తి కాదు.

ఈ నేపథ్యంలో డాక్టర్ లింగంపల్లి రామచంద్ర గారు 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన పూర్వ విద్యార్థులు, అభిమానులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు కలిసి తేదీ2-2 -2025 ఆలేరులో ఘన సన్మానం చేశారు. ముఖ్యంగా వారి పూర్వ విద్యార్థి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య గత నాలుగైదు నెలలుగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ కార్యక్రమాల్ని సమన్వయ పరుస్తూ తమ సంపాదకత్వంలో రామచంద్రామృతం అనే బృహత్ సంకలనాన్ని అభినందన సంచికగా వెలువరించారు. చాలామంది కవుల పండితుల అభినందన సంచికలు నా దగ్గర ఉన్నాయి. కానీ నాకు తెలిసినంతవరకు తెలుగు సాహిత్యంలో లింగంపల్లి వారి అభినందన సంచిక వెలువడినంత సమగ్రంగా, శాస్త్రీయంగా మరొకరిది వెలువడ లేదని ఘంటాపథంగా చెప్పగలను. రామచంద్ర గారి పట్ల అందరికి ఉన్న ఆదరాభిమానాలే అందుకు పెట్టుబడి అని చెప్పవచ్చు. పుత్రాధిచ్ఛేత్ పరాజయం అంటారు కానీ ఇక్కడ శిష్యాధిచ్ఛేత్ పరాజయం అన్నమాట నిజమనిపిస్తుంది. ఈ విషయంలో తేజ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు అధ్యాపకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య అన్ని తానే కార్యక్రమాన్ని




సమర్థవంతంగా నిర్వహించి తమ సమర్థతను నిరూపించుకున్నారు. డాక్టర్ లింగంపల్లి రామచంద్ర గారు 1993 నుండి ఇప్పటివరకు ఆత్మ అక్షరమైన వేళ, ఎప్పుడూ వసంతానివే, అమ్మ పిలుస్తోంది, గదిలో నక్షత్రం, ఆకాశం నా సంతకమే, ఆమనిలో వెన్నెల కోయిల, మరో ఉదయాన్నే పిలుస్తా, తూర్పు తీరం వంటి కవితా సంపుటులు, శ్రీ రంగరాజు కేశవరావు సాహిత్యం పరిశీలన పరిశోధన గ్రంథం, సినారె కవితా లోకనం, సరళరేఖలు, సమీక్షణం, సినారె వాక్కుకు వయస్సు లేదు మొదలైన సాహిత్య విమర్శ గ్రంథాలు, వాల్మీకి ఆశ్రమస్థలి వెల్ది, కొమురెల్లి మల్లన్న క్షేత్ర మహత్యం, అభ్యుదయ రచయిత పల్లేరు వీరస్వామి జీవిత చరిత్ర, 2021లో జనగామ జిల్లా సాహిత్య చరిత్రను వెలువరించారు. ఇవి కాక వందలాది వ్యాసాలు వివిధ సంచికలలో పత్రికలలో రాసి వ్యాసాల వ్యాసుడుగా పేరు తెచ్చుకున్నారు. వేలాదిమంది విద్యార్థుల్ని ప్రభావితం చేసి మహా మహోపాధ్యాయుడుగా గుర్తింపు పొందారు. వీరి ప్రతిభాపాటవాలను గుర్తించి రాష్ట్రంలోని పలు సాహిత్య సాంస్కృతిక సంస్థలు అవార్డులను అందజేశాయి.

ఇంతటి బహుముఖీన ప్రతిభాశాలైన డాక్టర్ లింగంపల్లి రామచంద్ర గారి సాహిత్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తూ రామచంద్రామృతం లో పెద్దల ఆశీస్సులు అభినందనలతో పాటు 18 శీర్షికలలో విషయాలను విశ్లేషించారు. సంపాదకీయామృతం నుంచి చిత్రమాలికామృతం వరకు అన్నింటికీ చివరన అమృతం చేర్చడంతో ఇది నిజంగా అమృతోత్సవ సంచిక అయింది. దీనికి కూరెళ్ళ శ్రీనివాస్ వేసిన ముఖచిత్రం మరింత శోభను చేకూర్చింది. "మనిషి కోసం కలం పట్టాను. మానవత కోసం గళం విప్పాను" అన్నది ఆయన సాహిత్య వ్యక్తిత్వానికి పునాది అని చెప్పవచ్చు. తండ్రిని గూర్చి రాస్తూ శ్రీవాణి ఆయన పట్టుదల చాలా సుకుమారమైనది. ఆయన సంకల్పం స్థిరమైనది అని అన్నారు. దీనిని బట్టి రామచంద్ర ఆలోచన, అందుకు తగిన వారి కార్యాచరణ మనకు గోచరిస్తుంది. పూర్వ విద్యార్థి బాలరాజు గురువు గురించి రాస్తూ పద్యాలు పాడుతుంటే పదాల అలలు గలగల ప్రవహిస్తున్నట్లు, గంభీరంగా పాడినప్పుడు కంచు కంఠం మోగినట్లు ఉండేదని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులంతా తెలుగు క్లాస్ కోసం తహతహలాడే వారంటే వారి బోధన పటిమను మనం అర్థం చేసుకోవచ్చు. మూర్తిభవించిన మానవతా వాదానికి ఆయన ప్రతిరూపమని తిరుమల రామచంద్ర అభివర్ణించారు. ఆచార్య హరిశివకుమార్ లింగంపల్లి వారి గురించి రాస్తూ విద్య ,వివేకం,వినయం అన్న మూడు సుగుణాలు ఆయనలో ముప్పేటగా ముడి వేసుకొని ఉన్నాయన్నారు.

ప్రముఖ కవి ఆచార్య ఎన్. గోపి రామచంద్ర గురించి రాస్తూ వస్తుతః ఆయన ఆర్ద్ర హృదయులు. అన్ని భావాలను కలుపుకు పోయే సమన్వ య శీలి అని ప్రశంసించారు. అలాగే ఆశావాదంతో ఆత్మవిశ్వా సాన్ని వెలిగిస్తాడని డాక్టర్ ఎస్. రఘు అభిప్రాయపడ్డారు. రామచంద్ర గారి జనగామ సాహిత్య చరిత్రను గురించి పానుగంటి రామమూర్తి రాస్తూ తమ సునిశిత పరిశీలన శక్తితో, కవితా రసాస్వాద నతో అపార సాహిత్య సంశోధనా అనుభవంతో నవ్య రీతులను కొత్త వెలుగులను పంచారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆలేరుకు చెందిన సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ తిరునగరి ప్రేరణ, ప్రోత్సాహం రామచంద్రను సాహితీ లోకంలో శిఖరాయమానంగా ఎదిగేలా చేసింది. పరిమళి ఒచిన అనుబంధంలో ఉపాధ్యా యునిగా రామచంద్ర తన ప్రస్థానాన్ని గురించి చెబుతూ నా సొంత ఆలోచనలను, అభిప్రాయాలను, ఆకాంక్షలను విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేయలేదు. మనసును మార్చగలిగేదే అసలైన శిక్ష అనే లక్ష్యంతో పయనించిన వాడిని అని నిజాయితీగా చెప్పుకున్నారు. వరంగల్లులో ఆయనకు పాఠాలు చెప్పిన గురువులతో పాటు వారి కవిత్వం పై ఉపన్యాస కళపై సినారె పద గుంఫన ప్రభావం ఉన్నట్లు కనిపిస్తుంది. ఇంతటి మహోన్నత వ్యక్తులైన డాక్టర్ లింగంపల్లి రామచంద్ర అశీతి మహోత్సవ సందర్భంగా వెలువరించిన భావ విపంచికఈ అమృతోత్సవ సంచిక.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# గీతం నూతన వీసీగా డాక్టర్ ఎర్రోల్ డిసౌజా

**• సిబ్బందికి పరిచయం చేసిన గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్**



**పటాన్‌చెరు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞావంతుడు, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితులయ్యారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో ఈ విషయాన్ని సిబ్బందికి వెల్లడించారు. డాక్టర్ ఎర్రోల్ డిసౌజా ప్రఖ్యాత ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్, ముంబై విశ్వవిద్యాలయంలో ఐఎఫ్ సీఐ చైర్ ప్రొఫెసర్‌గా, పారిస్‌లోని సైన్సెస్ పోలో ఇండియా చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ఆయన పీహెచ్ డీ పట్టా, ముంబై విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో ఎంఏ పట్టాలను పొందారు. అక్కడ ఆయన విద్యా నైపుణ్యానికి గుర్తింపుగా కాశీనాథ్ త్రింబక్ తెలాంగ్ బంగారు పతకం లభించింది. తన విశిష్టమైన కెరీర్‌లో, డిసౌజా కొలంబియా విశ్వవిద్యాలయంలో విజిటింగ్ స్కాలర్‌గా, సిమ్లాలోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ డ్ స్టడీలో విజిటింగ్ ప్రొఫెసర్ గా, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ లో సీనియర్ ఫెలో వంటి వివిధ ప్రతిష్ఠాత్మక పదవులను నిర్వహించారు. ఆయన విస్తృతమైన పాలనా అనుభవంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ద్రవ్య విధానంపై సాంకేతిక సలహా కమిటీలో, నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ, నేషనల్ హౌసింగ్ బ్యాంక్-రెండింటిలోనూ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. వెల్లూరులోని సీఎంసీ పాలక మండలిలో కూడా పాలుపంచుకోవడమే గాక, ఉదయపూర్‌లోని శ్రమ్ సారథి డైరెక్టర్ల బోర్డులో పనిచేస్తున్నారు.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్‌లోని కమిటీలకు కూడా డాక్టర్ డిసౌజా సేవలు విస్తరించాయి. భారత ప్రణాళికా సంఘం, నీతి ఆయోగ్ కార్యకలాపాలలో కూడా ఆయన చురుకుగా పాల్గొన్నారు. జర్నల్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్, ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ సంపాదకీయ బోర్డులలో ఆయన పనిచేస్తున్నారు. డాక్టర్ డిసౌజా ఇటీవలి ప్రచురణ, 'కాన్సెప్చువలైజింగ్ ది యుబిక్విటీ ఆఫ్ ఇన్ఫార్మల్ ఎకానమీ వర్క్' విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

డాక్టర్ డిసౌజా దార్శనిక నాయకత్వంలో, గీతం అనువర్తిత విద్య, అనువాద పరిశోధనలో దాని ప్రభావాన్ని మరింతగా పెంచడం, నైపుణ్యం, కరుణ- రెండింటితో వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి విద్యార్థులను శక్తివంతం చేయడం, ప్రపంచ స్థాయిలో సామాజిక పురోగతిని నడిపించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## వనపర్తి మార్కెట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**• మార్కెట్ సమస్యలపై ప్రభుత్వానికి నివేదికలు**

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేస్తుందో వేరుశనగ పంటను కూడా ప్రభుత్వపరంగా కొనుగోలు చేసేందుకు రైతులు చేస్తున్న డిమాండ్ ను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి సానుకూలంగా స్పందించారు. బుధవారం వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మార్కెట్ యార్డులో రైతులనుకుంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతుందని అదేవిధంగా వేరుశనగ పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరడంతో ఇందుకు స్పందించిన కలెక్టర్ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి నివేదిక పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారు, అంతేకాక రైతులకు వివిధ పంటలకు ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధర విషయాని నాణ్యతను మార్కెట్ యార్డ్ అధికారుల పనితీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ తో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అధికారుల తోపాటు జిల్లా కలెక్టర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కలియ తిరిగారు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మార్కెట్ కమిటీ అన్ని విధాల సహకారాలు అందిస్తుందని ఇలాంటి ఇబ్బందులు లేకుండా వివిధ గ్రామాల నుంచి ధాన్యము కొనుగోలుకు మార్కెట్ కు వస్తున్న రైతులకు మార్కెట్ యార్డులు ఇలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నామని ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు, మార్కెట్ యార్డ్ లో సందర్శించిన జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి స్వర్ణజిత సింగ్, మార్కెట్ సెక్రటరీ సరోజ మార్కెట్ డైరెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, శాంతన్న, శారద, గోపాల్ నాయక్, లతీఫ్, సురేష్, కృష్ణయ్య, తోపాటు మార్కెట్ కమిటీ సివిల్ వర్క్ సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## ఇరవై ఏళ్లుగా ఎస్సీలకు నో రిజర్వేషన్

**• జెడ్పిటిసి, ఎంపీపీ స్థానాలకు ఎస్సీలకు అవకాశం ఇవ్వండి**

**• బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల రవి**



**కొండాపూర్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కొండాపూర్ మండలంలో గత 20 ఏళ్లుగా ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించడం లేదని, త్వరలో రాబోయే జెడ్పిటిసి, ఎంపీపీ ఎన్నికల్లో జడ్పిటిసి, ఎంపీపీ స్థానాలకు ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలని బిఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల రవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎర్రోళ్ల రవి మాట్లాడుతూ ఎంపీపీ ఎస్సీలకు గత ఇరవై సంవత్సరాల నుండి అవకాశం రాలేదని ఈసారి కచ్చితంగా రెండు పదవులను ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండ రిజర్వేషన్లను చట్టబద్ధంగా చేపట్టాలని కోరారు.

## ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**• వై. జానకి జూనియర్ సివిల్ జడ్జి**




**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** న్యాయస్థానాలలో కక్షిదారులకు లోకదాలత్ సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని వనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వై. జానకీ అన్నారు బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలల న్యాయస్థానం బాలల సంక్షేమ సమితి కార్యాలయంలో లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కక్షిదారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలు మహిళలు, పిల్లలు, వృద్ధులు విపత్తులో ఉన్న బాధితులు మూడు లక్షల రూపాయలు సంవత్సర ఆదాయం ఉన్నవారికి ఉచిత న్యాయ సేవలు అమలవుతున్నాయి అని వివరించారు ఉచిత న్యాయ సేవలు పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు, లోక్ ఆదాలత్ సేవలకు టోల్ ఫ్రీ నెంబర్: 15100 సంప్రదించలానారు ఉచిత న్యాయ సేవలతో కక్షిదారులకు ఆర్థిక ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రాజేష్, డి. కృష్ణయ్య సఖి కేంద్ర లీగల్ కౌన్సిల్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్- రాంబాబు, బాలల సంక్షేమ సమితి సభ్యులు పారా లీగల్ వాలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, మధు లోక్ అదాలత్ సిబ్బంది కక్షిదారులు పాల్గొన్నారు.

# ఫీజు కట్టకుంటే దెబ్బలు తప్పవా..

**• విద్యార్థిని చితకబాదిన స్కూల్ యాజమాన్యం**



**టేక్మాల్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ప్రవేట్ స్కూల్లో పనితీరు అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూన్నా ప్రైవేట్ స్కూల్ యజమాన్యం. ఫీజులు కట్టకుండా ఉన్న విద్యార్థులపై తమ ప్రతాపాన్ని చూపుతున్న వైనం. టేక్మాల్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో వెలుగు చూసింది సంఘటన. బుధవారం హెూలీ స్పిరిట్ స్కూల్ లో 4వ తరగతి చదువుతున్న మనోహర్ అనే విద్యార్థి ఫీజు కట్టలేదని టీచర్లు చితకబాదారు, ఫీజు కట్టకుంటే పిల్లల్ని కొడతారా అని విద్యార్థి తల్లిదండ్రులు మండిపడుతున్నారు. తల్లిదండ్రులు స్కూల్ ఎదుట ఆందోళన చేశారు. స్కూలు యజమాన్యంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

**• త్వరలో నియోజక వర్గ వ్యాప్తంగా జాబ్ రిక్రూట్మెంట్ డ్రైవ్స్**

**• టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**కల్వకుర్తి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ప్రముఖ ఫాక్స్ కాన్ కంపెనీ వారు నిర్వహిస్తున్న జాబ్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు మాసబ్ ట్యాంక్ లోని టాస్క్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియల కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం చౌదర్ పల్లి నుండి పాల్గొన్న 16 మంది మహిళలు విజయవంతంగా ఇంటర్వ్యూస్ ప్రక్రియ పూర్తి చేసుకొని ప్రముఖ కంపెనీ లో ఉంద్యోగ అవకాశాలు పొందడం జరిగింది. ఈ సందర్భంగా టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ అవకాశాలు అందించడానికి ముందుకు వచ్చిన ఫాక్స్ కాన్ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా జాబ్స్ రిక్రూట్మెంట్ డ్రైవ్స్ నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం అని నియోజవర్గ వ్యాప్తంగా దాదాపుగా 3000 మంది వరకు మహిళలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు.

## వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** పదవతరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల అన్నారు. ఎస్సి డెవలప్మెంట్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతుల నిర్వహణలో భాగంగా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ నందు నిర్వహించిన శిక్షణా శిబిరానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. అందులో భాగంగా ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల మాట్లాడుతూ మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాకు, ఎస్సి డెవలప్మెంట్ వసతి గృహాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. ఇట్టి కార్యక్రమానికి డిఎస్సి డిఓ ఉమాపతితో పాటుగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, బిసి సంక్షేమ అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు స్వామి, సంగీత, నారాయణరెడ్డి, మధు, మహేష్, వసంత్ రావ్ నరసప్పతో పాటుగా వసతి గృహ సంక్షేమ అధికారులు, వెంకటేష్, అనిత,అఫ్జల్, నిర్మల,జగదీశ్వర్ రెడ్డి సిబ్బంది పూజారి నర్సింహులు, వసంత్, ఫీబమ్మ, చంద్రయ్య పాల్గొన్నారు.

## గుమ్మడిదల మండలంలో 144 సెక్షన్



**జిన్నారం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** గుమ్మడిదల మండలం కరణ్ నగర్ నల్లవల్లి వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్న సందర్భంగా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపడ్డగా వారిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషనులకు తరలించారు అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేమని నాయకులు అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు దీంతో పోలీసులు మండలంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఈ నేపథ్యంలో స్థానికులను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి భూత్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, చిన్నంశెట్టి ఉదయ్ కుమార్, నాగరాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయానికి అనువైన స్థలం ఎంపిక చేయండి

**• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టడం అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణం పాతూరు లో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు తో కలిసి కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతూరు లో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టేందుకు భూమిని గుర్తించే ప్రక్రియ లో భాగంగా ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, సంబంధిత నివేదికలు తయారుచేసి వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో రోజు 3 నామినేషన్ దాఖలు

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లలో భాగంగా మూడవ రోజైన బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు నల్గొండ జిల్లా కలెక్టర్వ,రంగల్-ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.హనుమకొండ జిల్లా, ధర్మసాగర్ మండలానికి చెందిన బంకరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ ను,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున మరో సెట్ నామినేషన్ ను దాఖలు చేసినట్లు ఆమె తెలిపారు.నల్గొండకు చెందిన పన్నాల గోపాల్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారని ఆమె పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా అదనపు కలెక్టర్ మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జే.శ్రీనివాస్ ఉన్నారు.



## ఎస్సీ వర్గీకరణ నివేదిక ఇవ్వడం చాలా బాధాకరం

**• మాల మహానాడు తాలుక అధ్యక్షులు విశ్వనాథం**



**నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగల డిమాండ్ కు రాష్ట్ర ప్రభుత్వం సెమీ ముక్తార్ ఏక సభ్య కమిషనర్ వేయడముతో 82 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం చాలా బాధాకరమని నారాయణఖేడ్ తాలూకా మాల మాహ నాడు డివిజన్ అధ్యక్షులు విశ్వనాథం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నారాయణఖేడ్ అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్ త్రీ లో 59 కులాలకు మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించాలని నివేదికలో పేర్కొనడం చట్టపరంగా చెల్లదని ఈ విషయంలో సుప్రీంకోర్టులో మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిటిషన్ వేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఎక్కువగా త్రీ గ్రూపులో ఉన్న మాలలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని సెమి మక్తార్ కమిషనర్ నివేదికలో పేర్కొనడం ఇంకా బాధాకరమని ఆయన అన్నారు . అదేవిధంగా ఎంపీ ఎమ్మెల్యేల సంబంధించిన గ్రూప్ వన్ అధికారులకు రిజర్వేషన్ వర్తిస్తుందని నివేదికలో పేర్కొనడం మరింత బాధాకరమన్నారు. ఈ కమిషన్ నివేదిక 2011 ప్రకారమే సర్వే చేసి నివేదిక ఇవ్వడం సరైన పద్ధతి కాదని ఆయన తెలిపారు. మాలలకు సంబంధించిన లక్షల మంది జనాభా సర్వే చేయకుండా పక్కన పెట్టడం కమిషనర్ నివేదికను తప్పుపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాలల జనాభా సరైన విధంగా సర్వే నిర్వహించి చట్టబద్ధతతో పార్లమెంట్లో ఆమోదించిన అనంతరం గెజిట్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమసేన్, తుకారం, కిష్టన్న, నారాయణ తదితరులున్నారు.

## కస్తూర్బా జూనియర్ కాలేజీ భవనానికి శంకుస్థాపన



**మానవపాడు, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఉమ్మడి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సహకారంతో.. మానవపాడు మండల కేంద్రంలోని..విద్యాభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉండే విధంగా చూస్తానని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. బుధవారము మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల ఇంటర్ జూనియర్ కాలేజీ భవనంకు ఎమ్మెల్యే విజయుడు, విద్యాశాఖ అధికారులతో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధి కోసం కస్తూర్బా గాంధీ ఇంటర్ జూనియర్ కాలేజీ భవనంకు మూడు కోట్ల రూ 25 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని..పనులు త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే విధంగా అధికారులను ఆదేశించారు. అలంపూర్ నియోజకవర్గం విద్యాభివృద్ధిలో వెనుకబడి ఉన్నది. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో విద్యార్థుల సౌకర్యార్థము నూతన పాఠశాల భవనాలు హాస్టల్ భవనాలు కస్తూర్బా గాంధీ భవనాలు మంజూరయ్యే విధంగా చూస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ హాస్టల్లో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా పై ఆరా తీసి భోజనం మెనూ పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ అనురాధ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ తగాదా విషయంలో హత్య

- నిందితుల అరెస్ట్
- తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి

**తూప్రాన్/శివ్వంపేట్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** శివంపేట మండలం తిక్క దేవమ్మ గూడెం పంచాయతీ పరిధిలోని సౌమ్య తండాలు మాలోతు మదన్ లాల్ అని వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచి చంపిన సంఘటన లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి తెలిపారు సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండవ తేదీన మదన్లాల్ అనే వ్యక్తిని భూమి తగాదా విషయములు అతనికి సంబంధించిన మాలోతు భరత్ మేకల నవీన్ అనే ఇద్దరు వ్యక్తులను తూప్రాన్ శివారులో గల కేఫ్ కాఫీ డే దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకొని వారిని విచారించగా మదన్లాలు తామే భూతగాధ విషయంలో హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు ఆయన వివరించారు మదన్ లాల్ అన్న కొడుకు అయిన భరత్ సీన్ అతనికి భూమి విషయంలో తగాదాలు ఉన్నట్లు తెలిపారు మాలోతు భరత్ సీన్ అతని స్నేహితుడు మేకల నవీన్ తో కలిసి ఈనెల 1వ తేదీన రాత్రి 8 .30 గంటల సమయంలో మదన్ లాల్ ఇంటికి వెళ్లి భూ విషయంలో గొడవ పడడంతో భరత్ అను అనే వ్యక్తి మదల్లాలు కత్తితో బలంగా నాలుగుసార్లు పొడవడంతో అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు ఈ సంఘటనలో



భరత్ సీన్ నవీన్ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు విలేకరుల సమావేశంలో తూప్రాన్ సిఐ రంగా కృష్ణ ఎస్సై మధుకర్ రెడ్డి లు పాల్గొన్నారు ఈ సంఘటనలో ఎస్సై లు శివానందం సుభాష్ గౌడులు సహకరించినట్లు తెలిపారు.

# పార్వతి పంపుహౌసులో ప్రమాదం

- కాంట్రాక్టు కార్మికుని మృతి



**రామగుండం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** అంతర్గాం మండలంలోని గోలివాడ గ్రామంలో కాలేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పార్వతి పంపు హౌజ్లో బుధవారం జరిగిన ప్రమాదంలో గుండబోయిన సంపత్ (38) అనే కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు పార్వతి పంపుహౌసులో ఓ కంపెనీలో మెకానికల్ ఆపరేటర్గా పని చేస్తున్నాడు. విధులలో భాగంగా మోటరు మరమ్మత్తు పనులు చేస్తున్న క్రమంలో ఓ పైపులోని ఇనుప రాడ్డు వేగంగా దూసుకు వచ్చి తలకు తగలటంతో తీవ్ర గాయలై ఆపస్మారక స్థితిలోకి చేరుకోవటంతో. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ అస్పత్రికి తరలించగా. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. కాగా మృతుని స్వగ్రామం ఎలుకతుర్తి మండలంలోని. దామెర కాగా కొన్ని సంవత్సరాలనుండి మండలంలోని మొరుమూరులో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. మృత్తునికి భార్య స్వప్న. కుమారుడు రితికేష్ (12).కూతురు అక్షర (9) ఉన్నారు. కాగా సంపత్ పనిచేస్తున్న కంపెనీ మృతికీ పూర్తి బాధ్యత వహిస్తూ పరిహారం ఇప్పించాలని. మృతుని బంధువులు పట్టు పట్టడంతో. పలువురు అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకుని మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇప్పించి న్యాయం చేసేందుకు సదరు కంపినిని ఒప్పించేందుకు మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

## ఆయిల్ పామ్ సాగుపై వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం



**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఆత్మ వరంగల్ సౌజన్యంతో, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు నందు నూనె గింజలు, మొక్కజొన్న, ఆయిల్ పామ్ సాగుపై కొనసాగుతున్నా వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ .ఎన్. రాజన్న, ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ నూనె గింజల పంటల ఉత్పత్తి ప్రాధాన్యతను, వాటి ఆవశ్యకతను రైతులకు తెలియజేశారు .2023 -24 సంవత్సరానికి గాను మన దేశం 5.44 మిలియన్ టన్నుల నూనెను ఎగుమతి చేసిందని రైతులకు తెలియజేయడం జరిగింది. డాక్టర్. సి.హెచ్ .సౌమ్య, వ్యవసాయ శాస్త్రవేత్త, ఆయిల్ ఫామ్ సాగు వివరాలను రైతులకు తెలియజేయడం జరిగింది. వీటిలో మొదటి సంవత్సరం అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయాన్ని పొందాలని రైతులను కోరడం జరిగింది. డాక్టర్. ఆర్ .అరుణ జ్యోతి, గృహ విజ్ఞానశాస్త్రవేత్త వివిధ వంట నూనెల గుణగణాలను చెప్పి వాటి ఆరోగ్య వివరాలను రైతులు, మహిళలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చెయ్యాలి

- తాడిచర్లలో ఆధార్ తిప్పలు




**మల్హర్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక మండల ప్రజలు చాలా ఇబ్బంది పడుచున్నారు.తాడిచర్లలో గతంలో ఆధార్ సెంటర్ ఉండేది కానీ అది ఎందుకు పనిచేయడం లేదో సామాన్య ప్రజలకు అర్థం కావటం లేదు. ఆధార్ సెంటర్ తో ప్రతి ఒక్కరికి అవసరమే, ఆధార్ అప్డేట్ చేసుకువాలన్నా,చిన్న పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలన్నా, సెల్ నంబర్ ఆధార్ లో మార్చుకోవాలన్న ఆధార్ సెంటర్ అవసరమే, ఆధార్ లో ఏదైనా మార్పు చెయ్యాలి అంటే మల్హార్ రావు మండల ప్రజలు మంథని లోని ఆధార్ నమోదు కేంద్రానికి వ్యయ ప్రయాసలకు ఓర్చి మంథనికి వెళ్ళలిసి వస్తుంది.ఇప్పుడు ఉన్నా రోజులలో ఆధార్ కు చాలా ప్రాముఖ్యత ఏర్పడింది.మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చెయ్యాలి అని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుచున్నారు.

## అమరుల స్మారక స్మృతి కేంద్రంగా తీర్చిదిద్దాలి



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** భీమదేవరపల్లి మండలం ములకనూరులో అమరుల స్థూపాన్ని తెలంగాణ అమరుల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ కవ్వం లక్ష్మిరెడ్డి,జేఏసీ మండల చైర్మన్ డెగ్యల సారయ్య, బుధవారం మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ను కలవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా కవ్వం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం కోసం నిండు నూరేళ్ల జీవితాలను తృణప్రాయంగా త్యాగం చేసారని తెలిపారు.వారి ప్రాణత్యాగం ఉద్యమకారులు దృఢ సంకల్పం సోనియాగాంధీ దాతృత్వంతో స్వ రాష్ట్రం సాకారమైందని గుర్తు చేసారు.జాతీయ రహదారి విస్తరణ కోసం తహశీల్దారును కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం,అమరుల స్థూపం గల ప్రాంతాన్ని అన్నివసుతులతో జంక్షన్ ఏర్పాటు చేయాలని కోరడమైనది. ఇంద్రవెల్లిలో కోరెగాంలో గల స్థూపాల మాదిరిగా తీర్చిదిద్దాలని ఇంద్రవెల్లిలో ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు.కాదని స్థూపాన్ని ముట్టుకుంటే ఎట్టి పరిస్థితులైన అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో చెప్యాల ప్రకాష్,రేణికుంట్ల బిక్షపతి,మాట్ల వెంకటస్వామి, మాడుగుల సంపత్ కుమార్,కండె సుధాకర్,పేటెం కుమారస్వామి, కుక్కుముడి ప్రభుదాస్, తాళ్లపల్లి ప్రభాకర్, పచ్చునూరి కర్ణాకర్, కడారి ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తాం

- ట్రాన్స్‌జెండర్ సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ట్రాన్స్‌జెండర్లకు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్ సమస్యల గురించి అధికారులు, ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి జిల్లా సంక్షేమ అధికారిని నోడల్ అధికారిగా నియమించటం జరిగిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా సంక్షేమ అధికారికి తెలుపాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డులో మార్పులు చేయుటకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఈడియంని ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లు తమ గుర్తింపు కార్డుల కోసం నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పరిశీలన తదుపరి జిల్లా కలెక్టర్ గుర్తింపు కార్డులు జారీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, సిడిపిఓ రూప, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ చైతన్య,మున్సిపల్ సిబ్బంది, మెప్మా అధికారులు, ట్రాన్స్‌జెండర్ లీడర్ బానోతు శ్రీలేఖ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధిలో పాలకవర్గాలదే కీలకపాత్ర

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ హయాంలో వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో సాధించిన అభివృద్ధిలో పాలకవర్గాలు కీలక పాత్ర వహించాయని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి ప్రశంసించారు. నాగవరం సమీపంలో గల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు కౌన్సిలర్లను బీఆర్ఎస్ అధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ వారి మౌళిక అవసరాలు తీర్చడానికి చేసిన కృషి అభినందనీయం అన్నారు. వనపర్తి అసెంబ్లీ నియోజకం ప్రగతి పథంలో ముందుండానికి వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీలు ప్రముఖ పాత్ర పోషించాయని కితాబునిచ్చారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో కొనసాగాలని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని రాణించాలని సూచించారు. మున్సిపల్ మాజీ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు గట్టు యాదవ్,పలుస రమేశ్ గౌడ్ (వనపర్తి), వాకిటి శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, సమద్,మేఘావత్ శాంతి, నుజహతున్నిసా బేగం, బండారు కృష్ణ, కంచె రవి, నాగన్న యాదవ్ , అలేఖ్య తిరుమల్, భారతీ ప్రేమ్ నాథ్ రెడ్డి,కోఆప్టెడ్ మెంబర్లు గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్ అలీ,మాజీ కౌన్సిలర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, నీలస్వామి, స్టార్ రహీమ్, ప్రేమ్ నాథ్ రెడ్డి ఉంగ్లమ్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కంపెనీల చేతిలో బీజేపీ ప్రభుత్వం

- 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- ఏఐటీయూసీ



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణమాఫీలు చేసే బిజెపి ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచడం లేదని, శ్రమజీవులు సంపద సృష్టికర్తలు అని వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మేకల దాసు, దుంపల రంజిత్ కుమార్ జిల్లా కార్యదర్శి, బ్రహ్మానదం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు .కేంద్ర ప్రభుత్వం పదేళ్ల కాలంలోనిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి మార్గం చూపలేదని వారన్నారు .కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణకు చర్యలు ఎంత మాత్రం లేవని ,రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతు చట్టాలను ఉపసంహరించుకోవాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని తెలిపారు.

## అట్టహాసంగా జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



**జనగామ ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** స్థానిక మినీ స్టేడియం ధర్మకంచ జనగామలో జిల్లాస్థాయి 14, 16, 18, 20 సంవత్సరముల బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు ఘనంగా జరిగినవి, ఈ ఎంపికలలో జిల్లా నలుమూలల నుండి దాదాపు 50 పాఠశాలల నుండి 300 మంది బాల బాలికలు పాల్గొన్నారు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తానని జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకటనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు 25 మంది క్రీడాకారులు ఎంపికయ్యారనీ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ నెల 17 మరియు 18 వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ నంది శెట్టి మనోజ్ కుమార్ తెలియజేశారు, ఈ ఎంపిక కార్యక్రమంలో వ్యాయామదర్శకులు ఆవుల అశోక్ ఆదేపు శ్రీనివాసు దిలీప్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటుతాయి కొండాపూర్ వాసుల నిరసన



**ముస్తాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** మండలంలోని కొండాపూర్ మానేరు వాగు నుండి ఇసుకను తరలించవద్దని ఇసుకను తరలించడానికి వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకొని నిరసన తెలిపారు కొండాపూర్ వాగు నుండి ఇసుకను తరలించుటకు వచ్చిన సుమారు 20 ట్రాక్టర్లను వాగులోకి వెళ్లకుండా గ్రామస్తులు అడ్డుకొని నిరసన తెలిపారు ఈ విషయాన్ని స్థానిక తాసిల్దార్ సిబ్బందికి విన్నవించడంతో ఇబ్బంది వచ్చి ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడి ట్రాక్టర్లను అక్కడి నుండి పంపివేశారని గ్రామస్తులు తెలిపారు గతంలో తుర్కపల్లి మానేరు వాగు నుండి ఇసుకను తరలిస్తే గ్రామస్తులు అడ్డుకొని ఇసుకను తరలించడం వల్ల వాగు పరిసర వ్యవసాయ రైతులకు నీటి ఎద్దడి ఏర్పడి రానున్న కాలంలో స్థానిక అవసరాలకు కూడా ఇసుక దొరకదని ట్రాక్టర్లను అడ్డుకొని నిరసన తెలిపిన విషయం తెలిసింది ఈ విషయంపై తాసిల్దార్ సురేష్ ని వివరణ కోరగా ఆవునూరు మానేరు వాగులో ఇసుక రిచ్ కు రిచ్ కు అనుమతులు ఉన్నాయని అక్కడ చెక్ డాం కట్టడంతో ఇసుకను తరలించుటకు వీలు లేకపోవడంతో కొండాపూర్ మానేరు వాగు నుండి ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులు కలెక్టర్కు విన్నవించడంతో కలెక్టర్ వాగును పరిశీలించి ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే విషయంపై మైనింగ్ అధికారులకు తెలపడం జరిగిందని దానిపై మైనింగ్ అధికారులు కొండాపూర్ వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించారని తాసిల్దార్ తెలిపారు గ్రామస్తుల తెలిపిన వివరాలను కలెక్టర్కు విన్నవించడం జరుగుతుందని అధికారులు నిష్కరించుకు అనుమతులు ఇచ్చిన చోట నుండే ఇసుకను తరలిస్తామన్నారు.

## కాళేశ్వరంలో ఎస్పీ పర్యటన



**కాళేశ్వరం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం లో జరగబోయే కుంభాభిషేకం, మహాశివరాత్రి, సరస్వతీ పుష్కరాల బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. ఈ నెల 7, 8, 9వ తేది లలో కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో జరిగే కుంభాభిషేకం మరియు ఫిబ్రవరి 26న జరిగే మహాశివరాత్రి , మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలలో అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుటకు రావడం జరుగుతుంది. కావున ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కాళేశ్వర ఆలయ పరిసరాలు, మెయిన్ ఘాట్, విఐపి ఘాట్ , బైపాస్ రోడ్డు లలో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. ఆయనతోపాటు కాటారం డిఎస్పి రామ్మోహన్ రెడ్డి మరియు మహదేవపూర్ సిఐ రామ్ చంద్రరావు , కాళేశ్వరం ఎస్సై జి.తమాషా రెడ్డి ఉన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ సిబ్బందికి వాహనాలకు సరైన పార్కింగ్ ఉండే విధంగా, ట్రాఫిక్ జాం కాకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు సూచనలు చేశారు.

## కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ మాదిగ ఉద్యోగుల డప్పుల దరువు



**గణపురం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ పిలుపు లో బాగంగా లక్ష డప్పులు వెయ్యి గొంతుకలు కార్యక్రమానికి తరలి వెళ్లుటకు మాదిగ ఉద్యోగులు డివిజనల్ ఇంజనీర్ ఎన్ భాస్కర్, సి.కెమిస్టు మోతె తిరుపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. అంజయ్యలో ఆద్వర్యంలో చెల్పూర్ ప్రక్క గ్రామాల మాదిగ యువజన సంఘాలకు గణపురం మండల యం.ఆర్.పి.ఎస్. ముఖ్యనాయకులు అంబాల చంద్రమౌళి, గాజుల బిక్షపతి బొల్లి బాబు లకు 100 డప్పులు చిర్రా చిటికె అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కెటిపిపి కాలనీ లో డప్పుల మోతలతో దరువు ప్రదర్శన నిర్వహించి పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కెటిపిపి మాదిగ ఉద్యోగులు కార్మికులు చిలువేరు మల్లయ్య, బొమ్మకంటి రాజేందర్ బీరెల్లి రాజు కొడెపాక రత్నాకర్, మోరె రవి, జెల్ల నాగేందర్, పొన్నాల తిరుపతి బొచ్చు శంకర్ పైడి, సంపత్, శంకర్ ఇనుగాల కుమార్లి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగణనపై బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

**బీఆర్ఎస్ పార్టీ వాకౌట్ చేసి బీసీలను అవమానించింది**

**కులగణన రాహుల్ ఆలోచన.. సీఎం రేవంత్ రెడ్డి ఆచరణ**

**గాంధీ భవన్ లో మీడియాతో మంత్రి కొండా సురేఖ.**

**హైదరాబాద్ (జనంసాక్షి)**




ఎన్నో ఏండ్లుగా అన్యాయానికి గురవుతున్న రాష్ట్రంలోని 56 శాతం బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని సంకల్పించిందని, బీసీ కుల గణనపై జరిగే కుట్రలను తిప్పి కొట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదని, అసెంబ్లీలో, శాసన మండలిలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి బీసీలను అవమానించారని మండిపడ్డారు. కులగణన రాహుల్ గాంధీ ఆలోచన అని, దాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆచరణలో సాధ్యం చేసి చరిత్రను సృష్టించారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వే - 2024 ప్రకటన ఇటీవల ప్రవేశపెట్టిన సందర్భంగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకరయ్య, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషంతో కలిసి కొండా సురేఖ విలేకరులతో మాట్లాడారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలో బీసీల సంఖ్య పెరుగుతున్నా, సామాజిక న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యను తీర్చేందుకే తమ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బీసీల కుల గణన చేపట్టినట్టు చెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనతో కుల గణన చేశామన్నారు. కుల గణనకి సంబంధించిన స్టేట్ మెంట్ మీదనే అసెంబ్లీ, శాసనమండలిలో తమ ప్రభుత్వం డిస్కసన్‌కు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. ఇంత కీలకమైన అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ చట్టసభ సభ్యులు సమావేశాల మధ్యలోనే వెళ్లిపోవడంతో సరికాదు అన్నారు. ఈ చర్య ద్వారా వారికి బీసీలపై ప్రేమ ఎంత ఉందో అర్థం అవుతుందని సురేఖ గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీల కోసం ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. కనీసం వారు చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ అయినా బయట పెట్టారా? అని నిలదీశారు. తమ ప్రభుత్వం బీసీల కోసం చేస్తున్న కృషిని పక్కదారి పట్టించేందుకు, బీఆర్ఎస్ తన సోషల్ మీడియా వేదికల ద్వారా కుల గణన పై నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, కుల గణన అమలును అడ్డుకుంటే బీసీలకే నష్టమని సురేఖ అభిప్రాయపడ్డారు. తాను రెండు కులాల ప్రతినిధిగా చెప్తున్నానని, కుల గణన ఒక చరిత్ర అని వ్యాఖ్యానించారు.

# అబాకస్ లో సత్తా చాటిన బిట్స్ విద్యార్థులు


**భూపాలపల్లి, ఫిబ్రవరి 5 (జనం సాక్షి)**



బ్రెయిన్ లీ అకాడమీ నర్సంపేట వారు నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీలలో భూపాలపల్లి పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ కి చెందిన విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు నేహాన్షీ రావు 3వ తరగతి రెండవ స్థానం, సహృది 2వ తరగతి నాలుగవ స్థానం, ధృతిపర్ణిక 4వ తరగతి ఐదవ స్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జోనల్ స్థాయిలో బహుమతులు గెలుపొందడం చాలా గర్వకారణమని ఇలాగే ఇంకా మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటూ ఉపాధ్యాయులకు , వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నల్లబెల్లి, ఫిబ్రవరి 05 (జనంసాక్షి):**



ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పంచాయతీ కంప్యూటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కల్లేపెల్లి రఘువరన్ అన్నారు. ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు అందించాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నర్సింహ మూర్తికి, ఎంపీఓ పసరగుండా రవికి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రఘువరన్ మాట్లాడుతూ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాల అందించాలని అన్నారు. ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్లు 9 నుంచి 10 గ్రామ పంచాయతీలను క్లస్టర్ల వారిగా చూసుకుంటూ గ్రామపంచాయతీకి సంబంధించిన ప్రతి విషయాన్ని ఆన్లైన్ లో పొందుపరుస్తున్నామని వివరించారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో కూడా డేటాను ఎంట్రీ చేస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వపరంగా గుర్తింపు లేకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్త నరేష్, సాటిక రజనీకాంత్ రెడ్డి, నాగరాజు, ఆఫ్రోజ్ పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం తెస్తారా..?

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) :**

**బాండ్ పేపర్ రాసిచ్చే ఎమ్మెల్సీ అభ్యర్థికే ఓట్లు వేస్తాం**

**బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్.**



ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వివిధ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు దీర్ఘకాలంగా పెండింలో ఉన్న న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, అలాగే "న్యాయవాదుల రక్షణ చట్టం" తెస్తామని హామీ ఇస్తూ బాండ్ పేపర్ రాసిచ్చే ఎమ్మెల్సీ అభ్యర్థికే న్యాయవాదుల ఓట్లు పడుతాయని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థులను డిమాండ్ చేసారు. నిత్యం ఏదో ఒక చోట న్యాయవాదుల పై దాడులు, హత్యలు జరుగుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని, దీనికి అడ్డుకట్ట వేయాలంటే "అడ్వకేట్స్ ప్రొటెక్షన్ ఆక్ట్"ను తక్షణమే తీసుకురావాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. అలాగే ఉపాధ్యాయుల కోసం టీచర్స్ ఎమ్మెల్సీ ఉన్నట్టు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉన్నట్టు, చట్ట సభల్లో చట్టాల పై పూర్తి అవగాహన ఉన్న న్యాయవాదులకు కూడా న్యాయవాదుల ఎమ్మెల్సీని ప్రవేశపెట్టేందుకు చట్టం తీసుకురావాలని, దీనిపై ఎమ్మెల్సీ అభ్యర్థులు గళం విప్పాలని బేతి మహేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. కొత్తగా ప్రాక్టీస్ కు వచ్చే జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ పదివేల రూపాయిలు ఇచ్చే విధంగా, జూనియర్ న్యాయవాదులకు ఆఫీస్ లు పెట్టుకునేందుకు బ్యాంకులు లోన్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు న్యాయవాది మరణిస్తే ఇప్పుడున్న వెల్ఫేర్ ఫండ్ ఆరు లక్షల రూపాయలను ఇరవై లక్షలకు పెంచాలని కోరారు. హెల్త్ ఇన్సూరెన్సు ను రెండు లక్షల రూపాయల నుండి ఇరవై లక్షలకు పెంచడమే కాకుండా న్యాయవాదుల తల్లితండ్రులను కూడా ఈ పాలసీ క్రింద చేర్చేవిధంగా చర్యలు చేపట్టాలని బేతి మహేందర్ రెడ్డి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను కోరారు.

# పార్కులలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**వరంగల్ బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే హార్టికల్చర్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష**

**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 5 (జనంసాక్షి):**



పార్కులలో పెండింగ్ ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్, ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఉన్న వివిధ పార్కులలో దెబ్బతిన్న జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులకు మరమ్మత్తులు, దెబ్బతిన్న లైటింగ్ ఏర్పాటు, నీటి సరఫరా పునరుద్ధరణ, నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో వాటి పురోగతి పై కమిషనర్ సమీక్షా నిర్వహించారు. పార్క్ లలో లైటింగ్ పనుల పురరుద్దరణ కు సంబంధించి 18 పార్కుల్లో చేపట్టిన లైటింగ్ మరమత్తులు ఈ ఈ ఎస్ ఎల్ లైట్ ల బిగింపు సంబంధిత ఫోటోలు పంపించాలని ఈ ఈ ని ఆదేశించారు.నగర పరిధిలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న మీడియన్ లలో ఉన్న మొక్కలపై దుమ్ము ధూళి పేరుకు పోయి ఉన్నాయని వాటిపై గ్యాంగ్ వర్క్ చేపట్టి నీటిని పిచికారి చేసి తొలగించాలని, రాంపూర్ నుండి కాజీపేట వరకు ఉన్న మీడియన్ లలో ఉన్న గ్యాప్ ఫిల్లింగ్ ప్రక్రియ చేపట్టాలని, పెద్దమ్మ గడ్డ ప్రాంతం లో మోనో కార్ప్ మొక్కల ఎదుగుదల సరిగా లేదని అందుకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ దఫా నర్సరీలో సుమారు 10 లక్షల మొక్కలు పెంచాలని అంచనా ఉందని కమిషనర్ సూచించగా అందుకు అనువుగా చర్యలు చేపట్టినట్లు హెచ్ ఓ లు వివరించారు.ఈ కార్యక్రమంలో
ఉద్యానవన శాఖ అధికారులు రమేష్ లక్ష్మారెడ్డి ఈ ఈ మహేందర్ డి ఈ లు రవి కిరణ్ రంగారావు హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, ప్రవళిక, అనూహ తదితరులు పాల్గొన్నారు

# తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించిన తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి)**



షెడ్యూల్డ్ కులాలను ఉపవర్గీకరించేందుకు రాష్ట్రాలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణను పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఎస్సీ వర్గాల మధ్య సమానమైన రిజర్వేషన్ల పంపిణీని నిర్ధారించే లక్ష్యంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను ఎట్టకేలకు మంత్రివర్గ ఉపసంఘం పరిష్కరించిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ దూరదృష్టి నిబద్ధతతో తెలంగాణ నిజమైన సామాజిక న్యాయం దిశగా ముందడుగు వేస్తున్నది అన్నారు. ఈ మైలురాయి సమాజంలోని అత్యంత అట్టడుగు వర్గాలను ఉద్ధరిస్తూ మరింత సమగ్రమైన, న్యాయమైన వ్యవస్థకు మార్గం సుగమం చేస్తుందని, ఇది తెలంగాణకు గర్వకారణం అని కొనియాడారు.

# ఏకసభ్య కమిషన్ పై ఏక పక్ష నిర్ణయం ఎలా తీసుకుంటారు?

**జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**



ఏక సభ్య కమీషన్ పై సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మాలలు సీఎం దిష్టి బొమ్మను దహనం చేసే కార్యక్రమం చేపట్టారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు .ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ వర్గీకరణ ఉపసంఘంలో గానీ, ఏకసభ్య కమిషన్ లో కానీ మాలల ప్రతినిధులు లేకుండానే కమిటీని వేసి ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మాల జాతిని అవమానంపరిచారని తెలిపారు. అలాగే ఒక జాతి కి వత్తాసు పలుకుతూ మాల జాతిని అవమాన పరచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ అంశాలను పున పరిశీలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొపుల రమేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మేకల మల్లన్న ,మాజీ అధ్యక్షులు మెట్టు ప్రహ్లాద్, ఉపాధ్యక్షులు ఏర్పాటు సుధీర్, సంయుక్త కార్యదర్శి ములకల రాజేశ్వర్, నాయకులు సంగతి అశోక్, మేదరి స్వామి, పాశం రాఘవేంద్ర, నల్ల రాజేశ్వర్, ముఛ రఘు,మలపతి సుభాష్, జగదీష్, రమేష్, ప్రదీప్, భూమన్న, రాములు,ఊశన్న, లింగన్న, శేఖర్, దౌడి పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే భూముల రైతులకు పరిహారం అందించే చర్యలు చేపట్టాలి




**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) :**

పరకాల డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల మీదుగా వెళ్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే భూములకు సంబంధించి పలువురు రైతులకు పరిహారం అందించడం జరిగిందని,మిగిలిన రైతుల వద్ద నుండి డాక్యుమెంట్స్ సేకరించి వారికి త్వరగా పరిహారం అందేవిధంగా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పరకాల డివిజన్ పరిధిలో గ్రీన్ఫీల్డ్ హైవే కోసం సంబంధిత భూముల రైతులకు పరిహారం చెల్లింపు అంశంపై నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, పరకాల, దామెర, శాయంపేట, మండలాల్లో సంబంధిత రైతులకు ఇప్పటి వరకూ ఎంతమందికి ఇంకా పరిహారం చెల్లించాలనే వివరాలతో పాటు క్షేత్ర స్థాయి పరిస్థితులను తహసీల్దార్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ భూములిచ్చిన రైతులలో పరిహారం అందని రైతుల నుండి డాక్యుమెంట్స్ సేకరించి పరిహారం అందించి త్వరగా భూసేకరణ ప్రక్రియ ను పూర్తి చేయాలన్నారు. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత రైతులతో స్థానిక తహసీల్దార్లు మాట్లాడి పరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పరకాల
ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు జగన్ మోహన్ రెడ్డి, జ్యోతి వరలక్ష్మి దేవి, విజయలక్ష్మి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5, ( జనం సాక్షి ):**

మధ్యాహ్న భోజనాన్ని పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. మెదక్ మండలం పాతూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం మెదక్ ఆర్డీవో రమాదేవి తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు . మంచినీటి డైనింగ్ హాల్, క్లాస్ రూమ్లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్ లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారి ని, మరియు విద్యార్థులకు వడ్డి%శీ%చడానికి సిద్ధంగా ఉన్న
అన్నం పరిశీలించారు. వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనం వండటానికి ముందే ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతాలేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రాయపర్తిలో గంజాయి పట్టివేత

**రాయపర్తి,ఫిబ్రవరి 5(జనంసాక్షి):**



రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రాయపర్తి పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాలు..ప్రకారం గంజాయి తరలిస్తున్న వ్యక్తి దగ్గర నుంచి సుమారు 2.6కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.అతను ఒరిస్సా రాష్ట్రం,మల్కన్ గిరి జిల్లా,బూధాన్ పల్లి తాలూకా,లచ్చిపట గ్రామానికి చెందిన లాబ్ బిశ్వాస్ గా గుర్తించారు.అతని పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే అందించాలి

- భూ నిర్వాసితుల కమిటీ న్వీనర్ వల్దాస్ రాజ్ కాళభైరవ

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న బియన్ తిమ్మాపురం గ్రామస్తులకు ఇండ్ల నష్టపరిహారం వెంటనే అందించాలని భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్ వల్దాస్‌రాజ్ కాళభైరవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బియన్ తిమ్మాపురం గ్రామంలో నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూములు 1750 ఎకరాలు పూర్తిగా బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురౌతున్నాయని అన్నారు. భూ నిర్వాసితులకు గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నష్టపరిహారం విషయంలో గ్రామ పునర్వాసం సంబంధించి అన్ని విధాలుగా అన్యాయం చేసిందన్నారు. లక్షలు ఖరీదు చేసే భూములు కేవలం ఎకరానికి 15 లక్షలు ఇచ్చి అన్యాయం చేసిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నేను గెలిచిన నెల రోజులలో మీ గ్రామ సమస్యలన్ని పరిష్కారం చేస్తానని చెప్పి గెలిచి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా గ్రామ పరిస్తితి ఏక్కడ వేసిన గొంగడి అక్కడె ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసి ప్రక్షళన భువనగిరి మీటింగ్‌కీ వచ్చిన్నప్పుడు ఆయన ముందు ఇండ్ల నష్టపరిహారం 50 కోట్లు వచ్చాయని చెప్పి ఆ డబ్బులు వచ్చి మూడు



నెలలు గడుస్తున్నా ఆ ముంపు బాధితుల ఖాతాలలో ఇంకా వెయ్యలేదన్నారు. ప్రభుత్వం మాటల ప్రభుత్వమేకాని చేతల ప్రభుత్వం కాదనడానికి ఇదొక నిదర్శనమన్నారు. నష్టపరిహారం విషయంలో కాలయాపన చేస్తు ముంపు గ్రామస్థులకు అన్యాయం చేస్తుందన్నారు. నష్టపరిహారం తొందరగా ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులందరితో కలిసి, భవిష్యత్తు కార్యాచరణలు, కలెక్టరేట్‌లు ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల కమిటీ సభ్యులు పిన్నం నారయణ, ఉడుత వీరాస్వామి, మణికంఠ, బిచ్చాల మహేష్, నవీన్, బాలు, పిన్నం గనేష్, పాండు ,లక్ష్మి, అనసూయ, పద్మ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- 24గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

**పాల్వంచ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డ్, గర్భిణీ స్త్రీల వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్ ను పరిశీలించారు. ఇన్ పేషెంట్ లో ఉన్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ వివరాలు, సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. కుక్క కాటుకు ఇచ్చే వ్యాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఔషధ నిల్వలు స్టాక్ పెట్టుకోవాలన్నారు.



ఆసుపత్రిలో రోగులకు రుచికరమైన బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వివిధ సమస్యలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌రింట్‌డెంట్ రాంప్రసాద్, డాక్టర్‌లు శ్కలేష్, మోహన్ వంశీ, ప్రసాద్, లావణ్య, నర్సింగ్ సూపరింట్‌డెంట్ సరళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ముగిసిన ఆపరేషన్ స్మైల్

- 197 మంది బాలల గుర్తింపు
- బాలల రక్షణకోసం నిరంతర తనిఖీలు నిర్వహిస్తాం
- బాలలను వెట్టిచాకిరికి గురిచేస్తే చర్యలు తప్పవు
- బాలల వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** జిల్లాలో జనవరి నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీస్, జిల్లా యంత్రాంగం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్ట్మెంట్ ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పకడ్బందిగా నిర్వహించామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీ గురవుతున్న 197 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షులకు క్షేమంగా అప్పగించడం జరిగిందని అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు బాలురు 82 మంది, బాలికలు 15 మంది ఉన్నారని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు బాలురు 75 మంది, బాలికలు 22 మంది ఉన్నారని తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరినీ గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని చేరేలా సిబ్బంది అందరూ



బాగా పని చేశారని అన్నారు. బాలల రక్షణలో తనిఖీలు నిరంతరంగా నిర్వహిస్తామని అన్నారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. వెట్టిచాకిరి గురి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెస్క్యూ ఆపరేషన్స్ ద్వారా 197 మంది పిల్లలను గుర్తించడంలో బాగా పని చేసిన పోలీసు సిబ్బంది, జిల్లా బాలల రక్షణ అధికారులను, వివిధ శాఖల సిబ్బందిని అభినందించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉందన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ప్రభుత్వాలు ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్నాయని, పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ప్రసవాల సంఖ్యను పెంచాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మి

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** బుధవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యం, ఆరోగ్య శాఖ అధికారిణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. మాత, శిశు సంరక్షణ సేవలను, గర్భవతుల, శిశువుల టీకా కరుణ కార్యక్రమం, అసాంక్రమిక వ్యాధుల నివారణ కార్యక్రమం, హెచ్ఐవి మరియు ఎయిడ్స్ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో నిర్వహిస్తున్న వందరోజుల నిక్షయ్ శిబిర్ కు ఆశా కార్యకర్తల ద్వారా క్షయ అనుమానిత రోగులందరికీ ఎక్సరే, కళ్ళ పరీక్షలు నిర్వహించి, నిర్ధారించిన క్షయ వ్యాధిగ్రస్తులందరికీ వెంటనే చికిత్స ప్రారంభించారు. జీవన శైలి వ్యాధులైన



అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతినెల క్రమం తప్పకుండా మందులు అందజేసి, ఆరోగ్యవంతమైన జీవన శైలి అలవరచుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వెంకట దాస్, డాక్టర్ భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ కృష్ణ మనోహర్, డాక్టర్ ప్రదీప్, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం ముగ్గురు కార్మికుల మృతి

- కూలీల జీవితాలతో చెలగాటమాడుతారా ?
- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 5 (జనం సాక్షి) :** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో అపార్ట్మెంట్ నిర్మాణానికి చేపట్టిన సెల్లార్ గోడ కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ఎల్బీనగర్ లోని సితార్ హోటల్ వెనుక ప్రాంతంలో సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నారు. ఇతర జిల్లాలకు చెందిన కూలీలు పనులు చేస్తుండగా సెల్లార్ గోడ కూలి భారీ స్థాయిలో మట్టి గడ్డలు మీద పడడంతో వీరయ్య, రాములు, వాసు లు ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. కొందరు తీవ్ర గాయాలతో హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి, ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. కామినేని హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న భిక్షపతి అనే వ్యక్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ



మృతి చెందిన వారికి 25 లక్షల రూపాయలు, హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న వారికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జీ.హెచ్.ఎం.సీ.అధికారులు, సెల్లార్ యాజమాన్యం, బిల్డర్ మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెల్లార్ నిర్మాణంలో నిబంధనలు పాటించకుండా పనులు చేస్తున్న కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారుల మీద మండిపడ్డారు. కూలీల జీవితాలతో చెలగాటమాడుతారా..? అధికారుల పర్యవేక్షణ లోపం వలన ఈ సంఘటన జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార సంస్థలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- 12 పాన్‌షాప్‌లపై కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వ్యాపార సంస్థలపై టాస్క్ ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ రకాల అసాంఘిక, చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు, లోకల్ పోలీసులు 6-బృందాలుగా ఏర్పడి సంగారెడ్డి పట్టణ, రూరల్, పటాన్ చెర్వు, పుల్కల్ పోలీసు స్టేషన్ల పరిదిలో సంగారెడ్డి చౌరస్తా నుండి ముత్తంగి చౌరస్తా వరకు వివిధ పాన్ షాప్ లపై దాడులు నిర్వహించి, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రభుత్వంచే నిషేధించబడిన నిషేధిత పొగాకు ఉత్పత్తులు, హుక్కా సామాగ్రిని స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్పీ తెలిపారు. షాప్ యజమానులపై మొత్తం 12 కేసులను నమోదు



చేయడం జరిగగిందన్నారు. జిల్లాలో ఎవరైనా నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి సాగు లేదా ఇతర మాదకద్రవ్యాలను అక్రమ రవాణా చేసిన అమ్ముతున్నట్లు గుర్తించినట్లైతే ఎస్ -నాబ్ (సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్) సెల్ నెంబర్ 8712656777 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ వివరించారు.

## కందులు ఎకరాకు 6 క్వింటాళ్లకు పెంచాలి

**చేర్యాల, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** కంది రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేతా వెంకన్న పేర్కొన్నారు. కంది పంట పండించిన రైతులకు మార్కెట్లో కందులు అమ్మడానికి ఎకరాకు 3 క్వింటాళ్ల 30 కిలోల నుంచి 6 క్వింటాళ్ల వరకు పెంచి, ఆన్ లైన్ లో పంట నమోదు చేయని రైతులకు ఆన్ లైన్ చేయడానికి అవకాశం కల్పించాలని, మార్కెట్ యార్డు అభివృద్ధితో పాటు పలు అంశాలపై చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలకవర్గం సభ్యులు బుధవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్



కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడీ జీవన్ రెడ్డి, డైరెక్టర్లు బైరగోని భాను ప్రకాష్ గౌడ్, ఇర్రి రాంరెడ్డి, పాల లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా బీసీ కులగణన సర్వే

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**చిట్యాల, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసి కుల గణన సర్వేను నిర్వహించిందనీ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.తెలంగాణ శాసన సభ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో బిసి కుల గణన సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్,పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించని విధంగా అధికారులు తూతుమంత్రంగా కాకుండా ప్రామాణికంగా,పక్కాగా బీసీ కుల గణన సర్వే నిర్వహించారని నేను కూడా నా కుటుంబ వివరాలను నా సొంత గ్రామం ఉరుమడ్ల గ్రామంలో నా కుటుంబ సభ్యుల వివరాలను అధికారులకు అందించినట్లు తెలిపారు.కావాలనే కొందరు ప్రతిపక్ష నేతలు అనుమానాలు,అపోహలు సృష్టించే విధముగా మాట్లాడుతున్నారని చెప్పారు.ప్రజలు ఎవరు కూడా వారి మాటలను నమ్మవద్దని, అపోహలకు గురికావాల్సిన అవసరం అసలే లేదన్నారు.రాష్ట్ర, జిల్లా, మండల,గ్రామ స్థాయిలో అధికారులు,ప్రజా ప్రతినిధులు ప్రజలకు అర్థం అయ్యే విధంగా గణాంకాలను వివరించాలని ఆయన సూచించారు. నిజమైన పేద వారికి సంక్షేమ పథకాలు అందాలి అంటే



ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు.ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా ఏపీఎల్,బీపిఎల్ రేషన్ కార్డ్స్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

## లింగమంతుల స్వామి వారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి వారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం దురాజ్ పల్లి పెద్దగట్టు వద్ద సంబంధిత శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది పెద్దగట్టు వద్ద బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ ప్రదేశాలు వద్ద ట్రాఫిక్ నియంత్రణ చేయుటకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని అన్నారు.భక్తుల కొరకు ప్రవేశ ద్వారాలు నిష్క్రమణ ద్వారా వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, విఐపిల కోసం ప్రోటోకాల్ అధికారిని నియమించాలని అన్నారు. దేవస్థానం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను స్వీకరించి పార్కింగ్ , తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు కొరకు భూమి చదును చేయడం,యాదవ పెద్దలకు సాంప్రదాయ వస్తువులు,దుస్తులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో వేణుమాధవ్ కు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శానిటేషన్, రోడ్లకు ఇరువైపున ఉన్న బుషెస్ తొలగింపు అలాగే తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, గుట్టపైన మహిళల కొరకు డ్రెస్సింగ్ రూముల ఏర్పాటు చేయాలన్నారు.మూడు షిప్టులలో 24 గంటలు పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.స్టాల్స్ కొరకు ఆయా శాఖల వారికి టెంట్లు, బల్లాలు, కుర్చీలు ఏర్పాటు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, లింగమంతుల స్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోలబోయిన నరసయ్య యాదవ్, ఆర్డిఓ వేణుమాధవ రావు, సిపిఓ ఎల్ కిషన్, డిఎస్పి రవికుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ కోట చలం, డిపిఓ



నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎండోమెంట్ ఈవో కుశలయ్య, కలెక్టరేటే ఏవో సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, తహశీల్దారులు శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణయ్య, పంచాయతీరాజ్ ఈఈ మాధవి, ఏఈ రాహుల్,ఈఈ ఆర్డబ్ల్యూఎస్ వైస్ శ్రీనివాసరావు, గ్రిడ్ అరుణాకర్ రెడ్డి, డిటిఓ సురేష్ రెడ్డి ,ఫైర్ ఆఫీసర్ నారాయణ, డిఎం ఆర్టీసీ సురెందర్. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోర్జరీ చీటింగ్ కేసులో నిందితుడు అరెస్ట్

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** టీఎన్జీఎస్ సొసైటీ ద్వారా అలాట్మెంట్ అయినా భూమిలో వ్యక్తి చనిపోగా అతని పేరుతో నకిలీ ఫోటో ఫోర్జరీ సంతకాలు, రిజిస్ట్రేషన్తో మోసం చేసిన స్థిరాస్తి వ్యాపారుడు కాగా, బాధితుడి కుమారుడు ఫిర్యాదుతో మైలార్ దేవ్ పల్లి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిమాండ్‌కు తరలించారు. మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ పి. నరేందర్ తెలిపిన విరాల ప్రకారం కాటేదాన్ లోని ప్లాట్ నం 517లోని 300 గజాల స్థలం ను జిపిఎ రజిష్టేషన్ చేసుకోగా, అట్టి ప్లాట్ ను సుబాష్, అశోక్ అగర్వాల్ సంజు దేవి లు పోర్టరి డాక్యుమెంట్స్ తో అక్రమించుకొని దానిలో బిల్డింగ్ నిర్మించినట్లు బాధితుడి కుమారుడు పవన్ గౌడ్ ఫిర్యాదుతో ప్లాట్ నం 517 ను కుక్కమల్ల ప్రకాషం కి 1974 వ సం.లో టీఎన్జీవోస్ సొసైటీ ద్వారా అలాట్ అయినదని, అప్పుడు అది ఖాలీ ప్లాట్ గా ఉండేదని, అయితే కుక్కల ప్రకాషం 1999 వ సం:రం లొ చనిపోగా, అది తెలుసుకున్న కాటేదాన్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కొప్పుల అమరేశ్వర్ గౌడ్ అనే వ్యక్తి అట్టి ప్లాట్ ను అక్రమించుకోవాలనే దురుద్దేశంతో కుక్కమల్ల ప్రకాషం చనిపోయిన 12 సం:రాల తరువాత అనగా 2011 వ సం:రం లో కొప్పుల అమరేశ్వర్ గౌడ్, తనకు తెలిసిన సుబాష్, శ్రీనివాస్, సయ్యద్ రషీద్ ఖాన్, నర్సిహ్మా రెడ్డి లతొ కుమ్మకై ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫొటోను పెట్టి, అమరేశ్వర్ గౌడ్ పోర్టరి సంతకం చేసి సుబాష్ అనే వ్యక్తి పేరు మీద జిపిఏ చెసినాడని, ఆ తరువాత అట్టి ప్లాట్ ను వీరు అందరు కలిసి మరల అశోక్ అగర్వాల్ అనే వ్యక్తికి అమ్మినారని విచారణలో తేలింది. తేది 28-01-2025 న శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్ట్ నందు హాజరు పరచగా, కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది, దీంతో ఈ రోజు కొప్పుల అమరెశ్వర్ గౌడ్ తండ్రి శ్రీరాముల్ని కూడ అరెస్ట్ చేసి కోర్టు నందు హాజరు పరిచారు.

# ఇకపై యూపీఐ లిమిట్ రూ.5 లక్షలు..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సెక్యూరిటీల మార్కెట్లో చెల్లింపులు చేసేందుకు కొత్త వ్యవస్థను తీసుకొస్తామని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా తెలిపింది. సురక్షితంగా, సమర్థవంతంగా చెల్లింపులు చేసేందుకు, మోసగాళ్ల నుంచి చట్టబద్ధమైన ఆర్థిక ఇంటర్మీడియరీలను వేరు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. యూపీఐ చెల్లింపుల పరిమితిని రూ. 5 లక్షలకు పెంచనున్నట్లు తెలిపింది.

ప్రస్తుతం దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)దే అగ్రస్థానం. నిత్యం కోట్లల్లో ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు సైతం యూపీఐ అనుమతించారు. అయితే, యూపీఐ ద్వారా మోసాలు పెరుగుతున్న క్రమంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. సెక్యూరిటీల




మార్కెట్‌లో చెల్లింపులు సురక్షితంగా, సమర్థవంతంగా ఉండేందుకు, మోసగాళ్ల నుంచి ఇంటర్మీడియరీలను వేరు చేసేందుకు కొత్త వ్యవస్థను తీసుకొస్తామని తెలిపింది. తమ వద్ద నమోదు చేసుకున్న ఆర్థిక ఇంటర్మీడియరీల కోసం ప్రత్యేక యూపీఐ అడ్రస్ రూపొందించాలనుకుంటున్నట్లు తెలిపింది.

రూ.5 లక్షలకు యూపీఐ లిమిట్ పెంపు

ఇలా చేయడం ద్వారా ఇన్వెస్టర్లు నమోదిత కంపెనీలకు మాత్రమే చెల్లిస్తున్నామని సులభంగా నిర్ధారించుకునేందుకు అవకాశం లభిస్తుందని సెబీ తెలిపింది. క్యాపిటల్ మార్కెట్ ట్రాన్సాక్షన్ల కోసం యూపీఐ పేమెంట్ల పరిమితిని రోజుకు రూ. 5 లక్షలకు పెంచాలనుకుంటున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ పరిమితి రోజుకు రూ. 2 లక్షలుగా ఉంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తో చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటా మని తెలిపింది. ఈ ప్రతిపాదనలపై సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. ఫిబ్రవరి 21వ తేదీలోగా ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది.

మార్కెట్లో చెల్లింపులకు యూపీఐ విధానాన్ని 2019 లో తొలిసారి అందుబాటులోకి తీసుకొచ్చింది సెబీ. అయితే, యూపీఐ చెల్లింపుల ద్వారా మోసాలు ఎక్కువయ్యాయి. పలు నమోదు కాని కంపెనీలు ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించి, మోసపూరితంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించింది. ఈ సమస్య రోజు రోజుకు పెరుగుతుండడంతో పరిష్కరించేందుకు ప్రతి నమోదిత ఇంటర్మీడియరీ కోసం ప్రత్యేక ఆల్ఫాన్యూమరిక్ యూపీఐ ఐడీ రూపొందించాలని సెబీ ప్రతిపాదించింది. సరైన ఇంటర్మీడియరీకే యూపీఐ పేమెంట్లు చేరినట్లు నిర్ధారించుకునేందుకు వీలుపడుతుందని తెలిపింది. నిర్ధారణ కోసం పచ్చ రంగు త్రికోణాకారంలో, థమ్స్ అప్ చిహ్నాన్ని పంపుతారు. ఇలా త్రికోణాకారం, థమ్స్ అప్ గుర్తులు రాలేదంటే అనధికార సంస్థకు చెల్లింపులు చేసినట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

# సీనియర్ సిటిజన్లకు శుభవార్త.. వాటిపై ట్యాక్స్ లిమిట్ పెంపు..



కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లకు పలు ప్రయోజనాలు ప్రకటించింది. పొదుపు పెట్టుబడులపై ట్యాక్స్ పరిమితిని రూ.1 లక్షకు పెంచడంతో పాటు పలు కీలక నిర్ణయాలు ఉన్నాయి. దీంతో సీనియర్ల చేతిలో ఎక్కువ డబ్బు మిగలనుంది.

ఈనెల తొలిరోజున ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2025లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక మార్పులను ప్రకటించారు. అందులో అత్యంత కీలకమైనది కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం. ఈ నిర్ణయం ప్రజల వినియోగ సామర్థ్యాన్ని, పొదుపును పెంచుతుందని కేంద్రం చెబుతోంది. అలాగే 60 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్లకు ఈసారి బడ్జెట్‌లో పలు ప్రయోజనాలు కల్పించారు. వారికి పన్ను ప్రయోజనాలు కల్పించారు. వివిధ అంశాలకు సంబంధించిన పన్ను పరిమితులను పెంచి భారీ ఊరట కల్పించారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే సీనియర్ సిటిజన్లకు అదిరే శుభవార్త అందించింది కేంద్రం. డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై మూలం వద్ద పన్ను రూ.50 వేలు దాటితే 10 శాతంగా ఉండగా దానిని ఈ బడ్జెట్‌లో ఏకంగా రూ.1 లక్షకు పెంచుతున్న ట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి గ్యారెంటీ రిటర్న్స్ ఇచ్చే పెట్టుబడులు పెట్టే సీనియర్లకు ఈ నిర్ణయం బిగ్ రిలీఫ్ ఇస్తుందని చెప్పవచ్చు. అలాగే బడ్జెట్ 2025లో అద్దె ఆదాయంపై వార్షిక టీడీఎస్ పరిమితిని సైతం పెంచారు. ప్రస్తుతం అద్దె ఆదాయం రూ.2.40 లక్షలు దాటితే టీడీఎస్ వర్తిస్తుండగా.. దానిని ఒక్కసారిగీ రూ.6 లక్షలకు పెంచారు. దీంతో రిటైర్మెంట్ తర్వాత అద్దె ఆదాయంపై ఆధారపడి జీవిస్తున్న సీనియర్ సిటిజన్లకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పవచ్చు. సాధారణంగా లిమిట్ దాటిన తర్వాత అద్దె చెల్లింపులై టెనెంట్లు 10 శాతం టీడీఎస్ తగ్గించి రెంట్ పే చేస్తారు.

ఇప్పుడు రూ.6 లక్షల వరకు పరిమితి ఇవ్వడంతో 10 శాతం ట్యాక్స్ సీనియర్ సిటిజన్ల చేతికి అందనుంది. వారికి ఆర్థిక భరోసా కలగనుంది. ఫైనాన్స్ బిల్ 2025 పరిధిలోని టీడీఎస్, టీసీఎస్‌లో మార్పులు చేయడం ద్వారా ట్యాక్స్ పేయర్లకు మేలు జరుగుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. విదేశీ విద్య కోసం పంపించే డబ్బులపై టీసీఎస్ ఎత్తివేయడం విద్యార్థుల తల్లిదండ్రులపై భారాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విదేశాల్లో చదువుల కోసం పిల్లలకు డబ్బులు పంపించే అవకాశం లభిస్తుందని చెప్పారు. వడ్డీ ఆదాయం, డివిడెండ్ ఆదాయాలపై సీనియర్ సిటిజన్లకు టీడీఎస్ పరిమితిని రెండింతలు చేశారు.

రెంటు ఆదాయంపై టీడీఎస్ పరిమితిని రూ.6 లక్షలకు పెంచారు. సీనియర్ సిటిజన్లకు అందించిన ముఖ్యమైన ప్రయోజనాల్లో వ్యక్తిగత ఆదాయపు పన్ను సైతం ఉంటుంది. ఆదాయపు పన్ను పరిమితిని కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షలకు పెంచడం సీనియర్ సిటిజన్ ట్యాక్స్ పేయర్లకు భారీ ఊరట కల్పించనుంది. అలాగే నేషనల్ సేవింగ్స్ స్కీమ్ విత్ డ్రాలపైనా ట్యాక్స్ మినహాయింపులు కల్పించారు. ఇది ట్యాక్స్ లయబిలిటీ సమస్య లేకుండా ఎక్కువ ఆదాయం అందుకునేందుకు దోహదపడుతుంది. అలాగే దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహిస్తుంది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం భారీ ఊరట కల్పిస్తుంది.




# ఐటీ విభాగం ఛైర్మన్ కీలక వ్యాఖ్యలు



వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపులు కల్పిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ క్రమంలో కొత్త పన్ను విధానంపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ రవి అగర్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై 90 శాతం మంది ట్యాక్స్ పేయర్లు కొత్త విధానంలోకి మారతారని అంచనా వేశారు.

వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు భారీ ఉపశమనం కల్పిస్తూ రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించింది కేంద్రం.

ఈ మేరకు బడ్జెట్లో ప్రకటన చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. కొత్త పన్ను విధానాన్ని మరింత ఉన్నతీకరించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఛైర్మన్ రవి అగర్వాల్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. 90 శాతానికిపైగా పన్ను చెల్లింపుదారులు కొత్త పన్ను విధానంలోకి మారిపోతారని అంచనా వేశారు. ఇప్పటికే పాత పన్ను విధానం నుంచి కొత్త విధానంలోకి 75 శాతం మంది ట్యాక్స్ పేయర్లు మారిపోయారని తెలిపారు.

'కొత్త పన్ను విధానంలో ఎలాంటి తగ్గింపులు, మినహాయింపులు ఉండవు. దీంతో ట్యాక్స్ నిపుణుల అవసరం లేకుండానే ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. సాధారణ పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయం వెల్లడించేందుకు ఎక్కువగా కష్టపడాల్సిన పని లేదు. ఐటీఆర్- 1 ఫామ్ ద్వారా ముందుగానే వారి ఆదాయ వివరాలు, టీడీఎస్ వంటివి నమోదై ఉంటాయి.' అని సీబీడీటీ ఛైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు.

ఐటీఆర్-యూలతో రూ.8,500 కోట్లు

గత సంవత్సరం 90 వేల మంది ట్యాక్స్ పేయర్లు తప్పుడు లేదా బోగస్ మినహాయింపు లు క్లెయిమ్ చేస్తూ రిటర్నులు దాఖలు చేశారని రవి అగర్వాల్ తెలిపారు. ఆ తర్వాత సవరించిన రిటర్నులు సమర్పించి రూ.1000 కోట్ల వరకు పన్ను చెల్లించారని పేర్కొన్నారు. 90 లక్షల మంది ఐటీఆర్- యూ (అప్‌డేటెడ్ ఐటీఆర్)లు సమర్పించడంతో ప్రభుత్వానికి రూ.8500 కోట్లు

పన్నులు వచ్చాయన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా హ్యూమన్ ఇంటెలిజెన్స్ వినియోగించడం ద్వారా వివిధ రకాల డేటాను ఎలక్ట్రానిక్ పద్ధతిలో విశ్లేషించడం ద్వారా ఐటీ శాఖ పన్ను చెల్లింపుదారుల పూర్తి సమచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. బోగస్ తగ్గింపు క్లెయిమ్‌లతో ఐటీ

రిటర్నులు దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తే దొరికిపోతారని హెచ్చరించారు సీబీడీటీ ఛైర్మన్ రవి అగర్వాల్.

# జాతీయం అంతర్జాతీయం

## మహిళకు ఎమ్మెల్యే ఫ్లయింగ్ కిస్.. కేసు నమోదు...



ఓ మహిళ పట్ల ఒక ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఆ ఎమ్మెల్యే తనకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చారని ఆ మహిళ ఆరోపించింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి.. ఆ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీగా వెళ్లిన ఆ ఎమ్మెల్యే.. ఓ మహిళను చూస్తూ అసభ్యంగా సైగలు చేశారని.. ఫ్లయింగ్ కిస్ ఇచ్చారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. 70 స్థానాల కు గానూ ఒకే విడతలో ఇవాళ ఎన్నికలు నిర్వహిస్తుండగా.. ఈనెల 8వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు హెూరాహెూ రీగా తలపడుతున్నాయి. వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ఉవ్విళ్లూరుతుండగా.. ఈసారైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ పీఠం కైవసం చేసుకునేది ఎవరు అనేది తేలాలంటే శనివారం వరకు ఆగాల్సిందే. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓ ఆప్ ఎమ్మెల్యే తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆప్ ఎమ్మెల్యే దినేష్ మోహానియా.. ఒక మహిళ పట్ల తీవ్ర అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచారానికి వెళ్లిన దినేష్ మోహానియా.. ఒక మహిళకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చారన్న వార్త ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు. దినేష్ మోహానియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతు న్నారు. ఢిల్లీలోని సంగం విహార్ నియోజక వర్గం నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దినేష్ మోహానియా.. తాజాగా మరోసారి అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమం లోనే ఇటీవల తన నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించిన దినేష్ మోహానియా.. ఓ మహిళతో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను చూస్తూ సైగలు చేసినట్లు బాధితురాలు ఆరోపించారు. ఆ తర్వాత ఆమెకు ఫ్లయింగ్ కిస్ ఇవ్వడంతో.. ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆ?గ్రహం వ్యక్తం చేసిన ఆ మహిళ.. తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. ఎన్నికల ర్యాలీలో భాగంగా దినేష్ మోహానియా ఫ్లయింగ్ కిస్ ఇచ్చిన ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఆ వీడియో వైరల్ కావడంతో ఎమ్మెల్యేపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతు న్నారు. అయితే ఇలాంటి వివాదాలు దినేష్ మోహానియాకు ఇప్పుడు కొత్తేమీ కాదు.

# నిత్యం నరకం చూస్తున్న విద్యార్థినులు!

ప్రయాణ ప్రాంగణాలు, రైల్వే స్టేషన్లు వంటి పబ్లిక్ ప్లేసుల్లో టాయిలెట్లు, బాత్రూంలు దారుణంగా ఉండడం గురించి మన అందరికీ తెలిసిందే. కానీ అంతకు మించిన స్థాయిలో నీచంగా ఉన్నాయి ఓ సర్కారు హాస్టల్లో. అక్కడుండేదంతా అమ్మాయిలే కాగా.. ఏ ఒక్క బాత్రూంకు కూడా తలుపులు లేవు. కనీసం పరిశుభ్రంగా కూడా లేవు. ఈ విషయంపై విద్యార్థినులు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోగా.. ఎట్టకేలకు ఓ అధికారి చర్యలు చేపట్టారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఉన్నా లేకపోయినా.. పెద్ద పెద్ద భవనాలు, పరిశుభ్రమైన టాయిలెట్లు మాత్రం మనకు కనిపిస్తూనే ఉంటాయి. నిర్వహణ కూడా చక్కగానే ఉంటుంది. కానీ 120 మంది విద్యార్థులు ఉంటున్న ఓ సర్కారు హాస్టల్లోని టాయిలెట్లు, బాత్రూంలకు మాత్రం తలుపులు కూడా లేవు. నిత్యం కంపు వాసన వస్తున్నా.. మూత్ర విసర్జన, మల విసర్జన, స్నానాలు చేసేటప్పుడు తోటి విద్యార్థులు చూస్తున్నా.. తప్పని సరి పరిస్థితుల్లో వారు తమ అవసరాలను తీర్చుకోవాల్సి వస్తోంది. ఈ దారుణమైన పరిస్థితిని ఎదుర్కుంటున్న ఆ విద్యార్థులు ఎవరు, ఇది ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఉత్తర కర్ణాటకలోని కొప్పల్ తాలూకా బేటగేరిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన వసతి గృహం పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారిపోయింది. అక్కడ మొత్తంగా 120 మంది విద్యార్థినులు ఉండి చదువుకుంటుండగా.. సరిపడా బాత్రూంలు, టాయిలెట్లు లేవు. ఉన్న వాటికి కూడా అసలు తలుపులే లేవు. ఏమాత్రం పరిశుభ్రంగా లేని ఆ బాత్రూంలు, టాయిలెట్లనే ప్రస్తుతం విద్యార్థినులు వాడుకుంటున్నారు. మల, మూత్ర విసర్జనలతో పాటు స్నానాలు చేయాలన్నా తోటి విద్యార్థులకు కనిపించే పరిస్థితి.

అయినా సరే చదువుకోవాలంటే వీటన్నిటినీ తట్టుకోవాల్సి వస్తుండగా.. విద్యార్థినులు నిత్యం నరకం చూస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై అనేక సార్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి ఉపయోగమూ లేకపోవడంతో.. పైఅధికారులకు సంప్రదించారు. ఈక్రమంలోనే సమగ్ర శిక్షా విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ హెచ్ అంజినప్ప జనవరి 16వ తేదీన సదరు పాఠశాలను తనిఖీ చేశారు. బాలికలు చెప్పినట్లుగా ఆ హాస్టల్లో నిర్వహణ సరిగ్గా లేదని.. బాత్రూంలు, టాయిలెట్లకు కనీసం తలుపులు కూడా లేవని నివేదిక ఇచ్చారు.

ముఖ్యంగా ఆ బడి ప్రధానోపాధ్యాయురాలు నిధులు దాచుకుంటూ నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహిచారని తెలిపారు. ఆమె చేస్తున్న తప్పుల వల్ల పిల్లలు శిక్షను అనుభవిస్తున్నారని వివరించారు. పరిశుభ్రత లేకపోవడం వల్ల దోమలు పెరిగి అనేక మంది విద్యార్థినులు అనారోగ్యం పాలైట్లు చెప్పుకొచ్చారు. అలాగే రోజూ దుర్వాసనతో మరింత ఇబ్బంది పడుతున్నారని.. ఈ సమస్యల వల్ల కనీసం చదువుపై కూడా పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారని స్పష్టం చేశారు.

దీంతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ శ్రీశైల్ బిరిదార్ జనవరి 20వ తేదీన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి బిడాగర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వు ఇంకా అమలు కాలేదు. కానీ వెంటనే ఆమెపై చర్యలు తీసుకుని బడిని బాగు చేస్తామని అధికారులు వివరిస్తున్నారు. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ మిలిటెంట్లు..

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ మిలిటెంట్లు అడుగు పెట్టనున్నారనే వార్తలు.. ఇప్పుడు భారత ఇంటెలిజెన్స్ వర్గాలను అలర్ట్ అయ్యేలా చేస్తున్నాయి. కాశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా పీఓకేలో ఏర్పాటు చేయనున్న ఓ కార్యక్ర మానికి హమాస్ సీనియ ర్ నేత ఒకరు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇందులో హమాస్‌తోపాటు లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలకు చెందిన నేతలు కూడా హాజరుకానున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భారత నిఘా వర్గాలు అప్రమత్తం అయ్యాయి. హమాస్ మిలిటెంట్లను అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు.. గత కొంత కాలంగా గాజా స్ట్రిప్‌పై భీకర దాడులు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం.. సొరంగాల్లో దాక్కొని ఉన్న హమాస్ నేతలను వెంటపడి మరీ హతమార్చుతోంది. ఈ క్రమంలోనే హమాస్‌కు కంచుకోటగా ఉన్న



గాజాలో వారి ఆటలు సాగడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలపై పట్టు సాధించేందుకు హమాస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఉగ్రవాద స్థావరాలను అడ్డాగా మారిన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ ప్రవేశించనున్నట్లు ఊహాగానాలు వెల్లువెత్తుతు న్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి హమాస్ నేత హాజరవుతుం డటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ మిలిటెంట్లు అడుగు పెడుతున్నారనే ప్రచారం నేపథ్యంలో భారత ఇంటెలి జెన్స్ వర్గాలు అప్రమత్తం అయ్యాయి. బుధవారం కాశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా.. పీవోకేలో అల్ అక్సా ఫ్లడ్స్ పేరుతో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఇందులో హమాస్ సహా ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, ఇతర సీనియర్ నాయకులు కూడా పాల్గొననున్నట్లు తెలుస్తోంది. హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి ప్రసంగానికి సంబంధించి కరపత్రాలు, ఇతర మార్గాల్లో పీఓకేలో ప్రచారం చేస్తున్నారు. అయితే తన ప్రసంగంలో ఖలీద్ కద్దామి.. కాశ్మీర్‌లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడవచ్చని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు పీఓకేలో ఉన్న జిహాదీ సంస్థలు ఇన్నేళ్లుగా వారు చేస్తున్న పోరాటాలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. మసూద్ అజర్ సోదరుడు తల్హా సైఫ్, అస్గర్ ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు కూడా ఈ సభకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా.. జమ్మూ కాశ్మీర్‌పై మంగళవారం హై లెవల్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని అమిత్ షా పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం సహా పలు కీలక అంశాలపై దృష్టిసారించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కాశ్మీర్‌లో వాహనాల తనిఖీలను కూడా ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇక గతేడాది ఆగస్ట్‌లో హమాస్ నేతలతో లష్కరే తోయిబా టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్.. ఖతార్ రాజధాని దోహాలో భేటీ అయ్యాడు. అయితే 2018లో సైఫుల్లా ఖలీద్‌ను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు ఈ సైఫుల్లా ఖలీద్ సన్నిహితుడు కావడం గమనార్హం.

# కొడుకు మూఢనమ్మకానికి తల్లి బలి!

డిజిటల్ యుగంలోనూ పలువురు మూఢ విశ్వాసాలపై నమ్మకం పెంచుకుంటున్నారు. వాటిని పక్క వారికి చెబుతూ వారు కూడా పాటించేలా చేస్తున్నారు. తాజాగా చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు తల్లికి పక్షవాతం వచ్చింది. ఎవరో కిరోసిన్ తాగిస్తే పక్షవాతం నయం అవుతుంద ని చెప్పగా.. వెంటనే ఆ పని చేశాడా యువ కుడు. ఫలితంగా తల్లి ప్రాణాలు కోల్పోయింది. దీంతో తన వల్లే తల్లి చనిపోయిందంటూ సదరు యువకుడు గుండెలవిసేలా రోదిస్తు న్నారు. మధ్య ప్రదేశ్‌లోని భోపాల్ గంగా నగర్ మురికి వాడ ప్రాంతానికి చెందిన 48 ఏళ్ల మంగళ బామ్నేరేకు భర్తతో పాటు కుమారుడు ఉమేష్ బామ్నేరే ఉన్నాడు. అయితే 32 ఏళ్ల వయసు కల్గిన ఇతడు ప్రస్తుతం స్క్రాప్ డీలర్‌గా పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 28వ తేదీ రోజు మంగళ బామ్నేరేకు పక్షవా తం సోకింది. అయితే పక్కింట్లో ఉన్న పలువురు కిరోసిన్ తాగిస్తే పక్షవాతం నయం అవుతుందని చెప్పగా.. దాన్ని నమ్మాడు ఉమేష్ బామ్నేరే. వెంటనే తన తల్లికి కిరోసిన్ తాగించాడు. దీంతో మంగళ పరిస్థితి విషమించింది. విషయం గుర్తించిన ఉమేష్ వెంటనే తల్లిని స్థానికంగా ఉన్న గౌతమ్ నగర్‌లోని నారియలే?డలోని ఆస్పత్రికి తరలించాడు. కానీ ఆమె పరిస్థితి మరింత విషమించడంతో అక్కడి వైద్యులు మంగళను ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో తల్లిని కాపాడుకునేందుకు ఉమేష్ వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అయితే సదరు మహిల కిరోసిన్ తాగడం వల్లే ఆమె పరిస్థితి క్షీణించినట్లు గుర్తించిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన కమలా నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మంగళ వద్దకు వెళ్లి వాంగ్మూలం తీసుకోగా.. తన కుమారుడు ఉమేష్‌యే కిరోసిన్ తాగించినట్లు చెప్పింది. ఆపై ఉమేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా.. పక్షవాతం సోకిన వారికి కిరోసిన్ తాగిస్తే నయం అవుతుందని తనకు కొందరు చెప్పారని.. అందుకే తల్లికి కొంచెం కిరోసిన్ తాగించినట్లు వివరించాడు.

# బీసీ..ఎస్సీలను తక్కువ...ఓసీలను పెంచి చూపుతాండ్లు

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, (జనంసాక్షి)**



78 ఏండ్ల స్వాతంత్ర్య అనంతరం దేశానికి వెన్నెముఖలాంటి బీసీ సామాజికవర్గాలకు రేవంత్ సర్కార్‌లో అవమానాలే దక్కుతున్నాయని, సీఎం రేవంత్ నిర్ణయం బీసీ వర్గాలను అపహస్యం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజ్వేషన్లను కల్పిస్తామని మోసం చేయడంతో పాటు బీసీల సంఖ్యను తగ్గించి అసెంబ్లీలో ఎలాంటి చట్టబద్ధత కల్పించకుండా కులగణన నివేదిక ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లో నల్లబ్యాడ్జీలను నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ ఉత్పత్తి జరుగాలన్న అది బీసీ వర్గాలతోనే సాధ్యమవుతుందని, ఉత్పత్తి కులాలుగా పేరున్న బీసీ సామాజికవర్గాలే దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి బీసీల పట్ల రేవంత్ సర్కార్ నిర్ణయం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎన్నికల మానీఫెస్టోలో గొప్పగా చెప్పి 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి కులగణన చేసి కేవలం జనబా లెక్కలు చెప్పి చేతులు దులుపుకున్నారని ఆయన అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జనాబా లెక్కలు 2014కంటే తక్కువ చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలు,ఎస్సీల సంఖ్యను చూపించి ఓసీల సంఖ్య పెంచి చూపించారని, ఈడబ్ల్యూసీలో ఓసీలకు సమాన హక్కులు రావడానికి రిజర్వేషన్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన వివరించారు. ఆనాడు నెహ్రూ కాంగ్రెస్
పార్టీ సమయంలో తరహాలో కులాలను విడగొట్టినం ఈ కులాలు ఒక్కటి కావు విడిపోయి ఉన్నరు. వీళ్లలో ఇక చైతన్యం రాదనే అహంకారంతోనే సీఎం నిండు అసెంబ్లీలో రిపోర్ట్‌ను ప్రవేశపెట్టి బీసీ వర్గాలను అవమానించారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చేయించిన కులగనణ సర్వే పత్రాలను ఈనాడు కొన్ని ప్రాంతాల్లో బీసీ వర్గాలు చించిపడవేశాయని, బీసీల్లో చైతన్యం వచ్చిందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు.

# టియుడబ్ల్యూజే ఐజెయు కరీంనగర్ డైరీ ఆవిష్కరణ



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) :**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియు డబ్ల్యూజె ఐజేయు కరీంనగర్ జిల్లా శాఖ ముద్రించిన 2025 డైరీని స్థానిక యూనియన్ కార్యాలయం ప్రెస్ భవన్ లో ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ ఆవిష్కరించారు. జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం కరీంనగర్ జిల్లా శాఖ డైరీని ముద్రిస్తుందని అందులో భాగంగానే ఈ సంవత్సరం 2025 డైరీని ముద్రించామని జర్నలిస్టుల దినచర్యలో భాగంగా ఉపయోగపడే విధంగా సమగ్ర సమాచారంతో అందరికీ ఉపయోగపడే విధంగా ఉంటుందని ప్రపంచంలో జరిగే ప్రతి విషయాన్ని అందులో పొందుపరచుకునే విధంగా ఉంటుందని బుధవారం రోజు డైరీ ని ఆవిష్కరించుకోవడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, కోశాధికారి
గాజుల వెంకటేష్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యులు విజయసింహారావు, నర్సింగోజు మహేందర్, రాష్ట్ర సోషల్ అండ్ డిజిటల్ మీడియా క్యాంపెనింగ్ కమిటీ సభ్యులు ఒంటెల కృష్ణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు సయ్యద్ ఇమాముద్దీన్ ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఊరడి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, ఏ శైలేందర్, ఎండి సుకూర్, సంయుక్త కార్యదర్శులు దాడి సంపత్, పోలు సంపత్, నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్ ఎంఏ అసాద్, వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ తోడేటి తిరుపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చెక్ డ్యాముల నిర్మాణల కోసం సర్వే

**సింగరేణి అధికారుల సూచనతో**

**ఇరిగేషన్ అధికారుల సర్వే**

**మంథని, (జనంసాక్షి)**



: పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో గల రెండు వాగులపై నాలుగు చెక్ డ్యాముల నిర్మాణాలకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఇటీవల సింగరేణి ఆర్. జీ -2 జీ. ఎం బండి వెంకటయ్యకు సింగరేణి ప్రభావిత గ్రామమైన పెంచికల్ పేట్ వాగుల పై చెక్ డ్యాములు నిర్మించి రైతులకు సాగునీటి ఇక్కట్లు దూరం చేయాలని పల్లె నారాయణ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో సానుకూలంగా స్పందించి చెక్ డ్యాముల నిర్మాణాలపై సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ క్రమంలోనే ఇరిగేషన్ అధికారులు పెంచికల్ పేట్ లో గల యాపల వాగు పై రెండు చోట్ల, మద్దుల వాగుపై మరో రెండు చోట్ల చెక్ డ్యాముల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాధిత స్థలాలను గుర్తించారు. అలాగే వీటి నిర్మాణాలకు సంబందించిన అంచనా వ్యయాలను రూపొందించే సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు నివేదికను సింగరేణి అధికారులకు సమర్పించనున్నారు. ఆ తదుపరి నిధులు మంజూరు కోసం సింగరేణి ఆర్. జీ -2 యాజమాన్యం సింగరేణి సంస్థ యాజమాన్యానికి నివేదిక సమర్పించనుంది. సింగరేణి సంస్థ ప్రభావిత గ్రామంతో పాటు పునరావాస కాలానీల ఏర్పాటుయైన గ్రామంగా గుర్తింపు కల్గివుంది. ఈ పరిణామల నేపథ్యంలో నూటికి నూరు శాతం సింగరేణి సంస్థ పెంచికల్ పేట్ గ్రామంలో గల వాగులపై చెక్ డ్యాముల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే అవకాశాలు కలవు.
సింగరేణి ప్రభావిత గ్రామ రైతులకు సాగు నీటి కష్టాలు తొలిగించే విధంగా కృషి చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి ఆ గ్రామ రైతుల పక్షాన వాగులపై చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టాలని వినతి పత్రం అందజేసిన పల్లె నారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ. ఈ జక్కా ప్రవీణ్ కుమార్, వర్క్ ఇన్ స్పెక్టర్ చిప్ప సదానందం, లష్కర్లు నారాయణ, రాజేందర్, రైతులు పల్లె నారాయణ, సిరివెన రాజు, డబ్బేట లింగయ్య, కొలిపాక పోచాలు, నూనె నర్సింగంలతో పాటు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులు శుభకార్యాలకు వెళ్లొద్దు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



ప్రైవేటు స్కూల్ బస్సులు శుభకార్యాలకు వెళ్లొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మహమ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లాకేంద్రంలో మాట్లాడుతూ పాఠశాల బస్సు స్కూల్ పిల్లలను మాత్రమే తరలించడానికి ఉపయోగించాలని చెప్పారు. వాహనాలు అన్ని పత్రాలు కలిగి ఉండాలి, స్కూల్ బస్సు నడిపే డ్రైవరు కనీసం ఐదు సంవత్సరాల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పై అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే మోటార్ వాహన చట్టం ప్రకారం సీజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మిగతా వాహనదారులు కూడా వాహన పన్నులు సకాలంలో చెల్లించాలని, ప్రతి వాహనదారుడు అన్ని పత్రాలు కలిగి ఉండాలని లేనట్లయితే పట్టుబడితే 200శాతం అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనం సాక్షి) బీ**



మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్, బ్యాలెట్ బాక్స్ ల నిర్వహణ తదితర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం పరిశీలించారు.
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటుపై పోలీసు అధికారులతో చర్చించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం బ్యాలెట్ బాక్స్ లు ఉపయోగించనున్న నేపథ్యంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ లోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ పరిశీలించారు. శుభ్రం చేసి రంగు వేసిన అనంతరం ప్రతి బాక్స్ ను, లాక్ సిస్టంను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ బ్యాలెట్ బాక్సులకు ఆయిల్‌లూబ్రి కెట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఒక నామినేషన్

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలు అయింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ నామినేషన్ వేశారు. అభ్యర్థి నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్ స్వీకరించారు. ఫిబ్రవరి 5 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్ వేశారు.

# అజ్ఞాతం వీడి.. జనజీవన స్రవంతిలో కలవండి

**లొంగిపోతే ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రయోజనాలు అందేలా చూస్తాం**

**రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్**

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 5, (జనంసాక్షి )**



మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ తో కలిసి బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని జాడి భాగ్య ఏ పుష్ప , జాడి వెంకటి మావోయిస్టు దంపతుల తల్లి మల్లమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పుష్ప తల్లి మల్లమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రస్తుత స్థితిగతులతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిపై కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు దుప్పట్లు, నిత్యావసర సరకులను అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జాడి పుష్ప , జాడి వెంకటిలు మావోయిస్టు దంపతులు 1999లో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వనం వీడి జనంలోకి వచ్చేలా చూడాలని, లొంగిపోతే ప్రభుత్వం నుండి అన్ని ఏర్పాట్లు చేస్తామని మావోయిస్టు పుష్ప తల్లి మల్లమ్మ, అన్న ఆవుల గంగారాంలను కోరారు. ఎన్నో ఏళ్లుగా అజ్ఞాతంలో వుండి మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని అన్నారు. ఇకనైనా పుష్ప అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని, ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని ఇవే కాకుండా అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు ఆరోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత
సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో హతమయ్యారని. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే వారిపై ఉన్న రివార్డ్ పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషిచేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫజలొద్దీన్, తాళ్ళగురిజాల ఎస్ఐ రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మా భూములు ఇవ్వం... కాలువ నిర్మాణం వద్దు

నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

**చిగురుమామిడి, ఫిబ్రవరి 04(జనం సాక్షి)**



గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నిర్మించతలపెట్టిన డి 4 లింకు కెనాల్ ఎల్ 21 మైనర్ కాలువ నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతులు కాలువ నిర్మాణం వద్దని నిరాహార దీక్ష చేపట్టారు. ఈ మైనర్ కాల్వ వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం లేనందున అధికారులు పునరాలోచించి కాలువ నిర్మాణ అలైన్మెంట్ మార్చాలని రైతులు కోరుతున్నారు. హుస్నాబాద్ శాసనసభ్యుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా చొరవ చూపి భూములు కోల్పోతున్న మమ్మల్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతులు చేపట్టిన దీక్షకు సిపిఐ, బీఎస్పీ నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలియజేశారు.

## లింగాపూర్ గ్రామంలో అగ్నిప్రమాదం

**సారంగాపూర్ ఫిబ్రవరి 5(జనం సాక్షి)**





: లింగాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి పశువుల కొట్టం దహనమై ఒక ఎద్దు మృతి చెందగా మరొక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి.ఈ ఘటనలో ఎద్దులతో పాటు పశుగ్రాసం(గడ్డి), వ్యవసాయ పనిముట్లు దగ్ధం అయినట్లు బాధితుడు తోడశం పూలరి తెలిపారు .ఈ ప్రమాదంలో రూ.2.లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయాడు. బాధిత రైతుకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు పాలకుర్తి క్రీడాకారులు

**పాలకుర్తి, ఫిబ్రవరి, 05(జనంసాక్షి)**



రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని పాలకుర్తికి చెందిన చిట్యాల రఘు, చెన్నూరుకు చెందిన బాలబోయిన సందీప్. ఈరవెన్నుకు చెందిన కొంతం కుమార్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ బాధ్యులు ఎన్ భగత్, కొండా రవి మాట్లాడారు. గత నెల 31న జనగామ జిల్లా కేంద్రంలో ప్రిస్టన్ ఇన్స్టిట్యూట్ మైదానంలో జిల్లా స్థాయిలో సీనియర్ పురుషులు, మహిళల సాఫ్ట్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించగా, మంచి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 7, 8, 9 తేదిల్లో వరంగల్ జిల్లాలోని బొల్లికుంటలోని వాగ్దేవి గ్రూపు అఫ్ ఇనిస్టిట్యూట్లో జరిగే 11వ రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను పలువురు అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు అభినందించారు,

# కేజీవిబి వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 05(జనం సాక్షి):**



నెల్లికుదురు మండలంలో ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయం (కేజీవిబీ) వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, వసతి గృహంలోని కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, క్లాస్ రూమ్, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన, ఆహారాన్ని అందించాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తూ ఉండాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ వంటలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇల్లందుల సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అపోలో రీచ్ హాస్పిటల్‌లో

# ఫౌండర్స్ డే వేడుకలు



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 05 (జనంసాక్షి) :**

అపోలో గ్రూప్ వ్యవస్థాపకులు పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్. సి. రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, బుధవారం అపోలో రీచ్ హాస్పిటల్‌లో ఫౌండర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వారు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు వైద్య సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వి.బి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ, కరీంనగర్‌లోని అనాధ వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాకుండా, వృద్ధులకు మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ నాగ సతీష్ కుమార్ మాట్లాడుతూ..
సమాజానికి మేం అప్పగించదలచుకున్న ఈ చిన్న సహాయం ఎంతో మందికి మేలుచేస్తుందనే ఆశతో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులు, లబ్ధిదారులు హాస్పిటల్ యాజమాన్యానికి, వి.బి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో వి.బి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీరబ్రహ్మేంద్ర స్వామి, అపోలో రీచ్ హాస్పిటల్ పరిపాలన అధికారి డాక్టర్ నాగ సతీష్ కుమార్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని సేవా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# కులగణనపై ప్రజల్ని తప్పదోవ పట్టించొద్దు!

- మీ రాజకీయాల కోసం ప్రజల్లో అపోహాలు సృష్టించొద్దు
- సర్వేను పారదర్శకంగా.. శాస్త్రీయంగా నిర్వహించాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని లిరాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓ ప్రకటనలో కోరారు ఇది రాజకీయాలు చేసేందుకు సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు. కులగణన సర్వే ను అత్యంత పకడ్బందీగా నిర్వహించాం. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ ఇంటింటికెళ్లి వివరాలను సేకరించాం. ఆ సమాచారం ఆధారంగానే నివేదికను రూపొందించాం. అయినా.. కొందరు పనిగట్టుకుని నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు' అని విమర్శించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ను అశాస్త్రీయంగా నిర్వహించింది. పారదర్శకతకు పాతరేసి తప్పుల తడకగా నివేదికను తయారు చేసింది. సర్వే చేయించిన వారు ఆ వివరాలను ప్రజల ముందు పెట్టలేకపోయారు. శాసనసభలో పెట్టే సాహసం చేయలేదు. ఆ సర్వేకు ఎటువంటి ప్రామాణికత లేదు. అయినా దాని ప్రస్తావన 9 ఏళ్ల తర్వాత ఇప్పుడు తెస్తున్నారు. ఆ తప్పును మేం సరిదిద్దాం. అందుకు మమ్మల్ని అభినందించాల్సింది పోయి విమర్శించడం ఎంత వరకు సమంజసం' అంటూ ప్రశ్నించారు. 'ప్రతిపక్షాలు బీసీలపై ఇప్పుడు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికీ.. ఎప్పటికీ బీసీలకు అండగా నిలబడేది కాంగ్రెస్ పార్టీనే. మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తాం. రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకు రూపొందించిన బీసీ డిక్లరేషన్ ను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని స్పష్టం చేశారు. 'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కచ్చితంగా కేటాయిస్తాం. కాంగ్రెస్ కు బీసీల పట్ల ఉన్న చిత్త శుద్ధిని నిరూపించుకుంటాం. మరి.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ మాట చెప్పగలవా..?' అంటూ ప్రశ్నించారు. రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ చేయలేని ఎన్నో పనులను ఏడాదిలోనే మేం చేశాం. అందులో కుల గణన కూడా ఒకటి. అది చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేక నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వారికి బీజేపీ నేతలు కూడా వంత పాడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం. ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని ప్రజలను కోరుతున్నా. మీ రాజకీయాల కోసం ప్రజల్లో అపోహాలు సృష్టించొద్దు' అని ప్రతిపక్షాలకు సూచించారు.

# పెద్ద ధన్వాడలో మౌనదీక్ష

- 14వ రోజు నోటికి నల్ల బట్టలు కట్టుకుని నిరసన
- ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసేదాకా పోరాడతామని ఉద్ఘాటన



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** పెద్ద ధన్వాడలో చేపట్టబోయే ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలనీ తలపెట్టిన రిలే నిరాహారదీక్షలు 14వ రోజు నిరసనకారులు నోటికి కానిదేమో నల్లబద్ద ధరించి నిరసన తెలిపారు. పెద్దధన్వాడ, చిన్న ధన్వాడ గ్రామాలకు చెందిన నాయకులు శీను, రాజు, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, బీరప్ప, లింగన్న, నాగన్న, నాగేష్ ,వెంకటేష్, బజారి, పెద్దయ్య, రాజు, గోవిందమ్మ, శివమ్మ, రాణమ్మ, తిమ్మక్క, మంజుల ,నజీర్ అల్లా, బకాష్, ఫకీరయ్య, పెద్దయ్య ముఖానికి నల్ల గుడ్డలు కట్టుకొని మౌన దీక్ష చేస్తూ దీక్షలో పాల్గొన్నారు. రిలే నిరాహార దీక్షలను భగ్నం చేయాలని తహసిల్దార్, సిఐ గ్రామ ప్రజల మీద ఒత్తిడి తీసుకొచ్చామని, ఏదేమైనప్పటికీ మా రిలే నిరాహార దీక్షలు కంపెనీ రద్దు అయ్యే వరకు కొనసాగిస్తామని అన్నారు. గ్రామాల ప్రజల ఆరోగ్యాలను ఫణంగా పెట్టి వ్యక్తుల ప్రయోజనాల కోసం ఈ ఇథనాల్ కంపెనీని మొదలుపెట్టాలని చూస్తే సహించేది లేదనీ, ఇథనాల్ కంపెనీ ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించకున్నా మాపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూసినా ఎట్టి పరిస్థితుల్లోనైనా ఉద్యమాన్ని కొనసాగిస్తా మన్నారు. ప్రభుత్వం తమ రైతుల అభిప్రాయాలను తీసుకొని కంపెనీ రద్దు చేయాలని,ఇథనాల్ కంపెనీ రద్దయ్యేదాకా తమ పోరాటం ఆగదని దీక్షలో పాల్గొన్న రైతులు, యువకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జయరాం రెడ్డి, చిన్నయ్య, నారాయణ, బీమన్న, ఎల్లప్ప ,రాజేంద్ర, ప్రసాద్, కుమ్మరి తిమ్మప్ప, సామేలు, సెద్రీకు, అలెగ్జాండర్, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు,ఎంపిటిసిలు,అదే విదంగా రిలే నిరాహార దీక్షలకు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు మద్దతు తెలిపి ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు అయ్యో దాకా పోరాటం ఆపబోమని, మీ వెంటే మేము ఉంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం

- ఈ కేసులో నిందితుడి కుమారుడిపై కేసు
- పోలీసు అధికారులపైన కేసు ఫైల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డా.చైతన్యరెడ్డిపై కేసు నమోదు అయ్యింది. అలాగే పలువురు పోలీసు అధికారులపైనా కేసు ఫైల్ అయ్యింది. వివేకా కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కడప సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు జైల్లో చైతన్య తమను కలిసి మభ్యపెట్టినట్లు గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు దస్తగిరి. వివేకా కేసులో కేవలం బాధితుల ఒత్తిడి వల్ల అప్రూవర్‌గా మారి అపద్దాలు చెప్పాల్సి వచ్చిందని.. చెప్పమని చైతన్య ఒత్తిడి తెచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలా చేస్తే రూ.20 కోట్లు ఇస్తామని చైతన్య మభ్యపెట్టినట్లు అప్పట్లో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా చైతన్య రెడ్డితో పాటు అప్పట్లో కేసు నమోదు చేయకుండా నిందితులకు సపోర్టు చేయమని తనపై ఒత్తిడి తెచ్చిన పోలీసు అధికారులపైనా దస్తగిరి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్య, సెంట్రల్ జైలు సూపరెండెంట్ ప్రకాష్‌లపై పులివెందుల పోలీసులు ఇప్పుడు కేసు నమోదు చేశారు. కాగా.. 2023 నవంబర్‌లో దస్తగిరి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న సమయంలో చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి తనను బెదిరించాడంటూ పలు మార్లు మీడియాకు తెలిపారు దస్తగిరి. అంతే కాకుండా సీబీఐ, జిల్లా ఎస్పీలకు కూడా ఫిర్యాదు చేశారు. మొత్తానికి దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదుపై ఎట్టకేలకు చైతన్య రెడ్డిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. చైతన్య రెడ్డితో పలువురు పోలీసులు అధికారులపై కూడా కేసులు నమోదు అయ్యాయి.అయితే గతంలో దస్తగిరి ఫిర్యాదును తప్పుబట్టారు చైతన్య. కేవలం మెడికల్ క్యాంపు కోసమే జైలు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. తనతో పాటు జైలు అధికారులు, వైద్యాధికారులు ఉన్నట్లు తెలిపారు. తాను నిజంగా జైలుకు బెదిరించడానికే వెళ్లి ఉంటే అప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయాలేదని అప్పట్లోనే చైతన్య రెడ్డి ప్రశ్నించారు. దస్తగిరిది అంతా క్రిమినల్ మైండ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. మరి ఇప్పుడు తాజాగా పోలీసులు కేసు నమోదు చేయడం పట్ల చైతన్య రెడ్డి ఏ మేరకు స్పందిస్తారో చూడాలి. మరోవైపు దస్తగిరిని బెదిరించారంటూ ఆరోపణలు ఎదుర్కుంటున్న చైతన్య రెడ్డికి గతంలో సుప్రీం కోర్టు నోటీసులు కూడా జారీ చేసింది.

# భక్తుల టూరిజం కార్పొరేషన్ ప్రత్యేక ప్యాకేజీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఈ నెల 26న మహా శివరాత్రి ఈ పర్వదినం సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తుతుంటాయి. భక్తుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో ప్యాకేజీని ప్రకటించింది. అయోధ్య- కాశీ పుణ్యక్షేత్ర యాత్ర, జ్యోతిర్లింగ దర్శనం ప్యాకేజీని ప్రకటించింది. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. ఎనిమిది రాత్రులు/తొమ్మిది పగళ్లు సాగే యాత్ర ఇది. ఈ నెల 28వ తేదీన సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్తుంది. మొత్తం 718 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్- 460, 3ఏసీ- 206, 2ఏసీ- 52 సికింద్రాబాద్ నుంచి బయలుదేరి ఖాజీపేట్, వరంగల్, ఖమ్మం, ఏపీలోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, ఒడిశాలోని బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భవనేశ్వర్, కటక్, భద్రక్, బాలేశ్వర్ స్టేషన్‌లల్లో ఈ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ సౌకర్యం ఉంది. ఈ ప్యాకేజీలో గయ- వారణాశి- అయోధ్య- ప్రయాగ్ రాజ్ ఉన్నాయి. గయలో విష్ణుపాద ఆలయం, వారణాశిలో కాశీ విశ్వనాథుడు, అక్కడి కారిడార్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవి ఆలయాలను సందర్శించవచ్చు. అయోధ్యలో శ్రీరామచంద్రులవారి ఆలయం, హనుమాన్ గర్హి, హారతి, అత్యంత ప్రాచీనమైన సరయూ నదిని దర్శించవచ్చు. ప్రయాగ్ రాజ్‌లో త్రివేణి సంగమంలో మహా కుంభమేళా పుణ్యస్నానాలను ఆచరించడంతో ఈ ప్యాకేజీ టూర్ ముగుస్తుంది. ప్రయాగ్ రాజ్ నుంచి మళ్లీ సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్. ఈ ప్యాకేజీ కోసం ఒక్కొక్కరు చెల్లించాల్సిన ఛార్జీ మొత్తం 14,390 రూపాయలు. ఇది ఎకానమీ అంటే స్లీపర్ క్లాస్. ఇందులో పిల్లలు అంటే 5 నుంచి 11 సంవత్సరాల్లోపు వారికి 13,495 రూపాయల ఛార్జీని నిర్ధారించారు. థర్డ్ ఏసీలో పెద్దలకు 23,600, పిల్లలకు 22,550 రూపాయలు, సెకెండ్ ఏసీ పెద్దలకు 31,160, పిల్లలకు 29,990 రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. దేశంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ.. భారత్ గౌరవ్ పేరుతో ఈ ప్రత్యేక రైళ్లను నడిపిస్తోన్న విషయం తెలిసిందే. వీటికి ప్రయాణికుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. ప్రారంభమైన అన్ని చోట్ల కూడా ప్రయాణికుల ఆదరణ భారీగా ఉంటోంది. వాటి ట్రిప్‌ల సంఖ్యను పెంచుతోంది.

# ఆగాఖాన్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మ విభూషణ్ గ్రహీత ఆగాఖాన్ (88) కన్నుమూశారు. ఆగాఖాన్ మృతి చెందిన విషయాన్ని ఆగాఖాన్ ఫౌండేషన్ ప్రకటించింది. పోర్చుగల్‌లోని లిస్బన్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆగాఖాన్ ఫౌండేషన్ సోషల్ మీడియా ద్వారా వెల్లడిరచింది. కాగా ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఇస్మాయిలీ ముస్లింల వారసుడిగా ఆధ్యాత్మిక గురువుగా నియమితులైన కరీం అల్-హుస్సేనీ ఆగాఖాన్ మరణం మానవాళికి తీరని లోటని అన్నారు. గొప్ప సామాజిక వేత్త, మానవతావాదిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును అందుకున్నారని తెలిపారు. ఆగాఖాన్ నెట్ వర్క్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్యా, సాంస్కృతిక సంస్థలను నెలకొల్పి మానవాళికి తన సేవలను అందించారని గుర్తు చేశారు. పేదరిక నిర్మూలన, వారసత్వ సంపద పరిరక్షణకు, వైద్య సేవలు, విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివని, హైదరాబాద్ కేంద్రంగా ఆగా ఖాన్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయన జీవితాంతం మానవ జాతి గౌరవం పెంచే ఉన్నత విలువలను ఆచరించారని కొనియాడారు. వారి వారసులకు, కుటుంబసభ్యులకు, అనుచరులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్



**హైదరాబాద్, జనవరి 5 (జనంసాక్షి) :** తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్(టీఎస్ జేయు) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం త్వరలో చేపట్టబోతున్న 2కే రన్ కార్యక్రమ ప్రచార పోస్టర్ ను బుధవారం తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సామాజిక బాధ్యతగా సమాజంలోని రుగ్మతలను దూరం చేసేందుకు ప్రయత్నించడం అభినందనీయ మన్నారు. జర్నలిస్టులు జర్నలిస్టు సంఘాలు ఇందు కోసం కృషి చేయాలని కోరారు. ఈ 2కే రన్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగొని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు లింగబత్తిని కృష్ణ, ముత్యం ముఖేష్ గౌడ్, వెల్తూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణనపై కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబురాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులు స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. అసెంబ్లీలో కులగణన రిజర్వేషన్ ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ముఖ్య నేతలు చల్లూరి మధు, ముంజాల రవీందర్ లు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాల్సిన అవసరం ఉన్నా కూడా అది తుంగలో తొక్కి దేశంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టి రాష్ట్రంలో ఉన్న సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వెంటనే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని వారు పార్టీ తరుపున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కులగణన ఉప చైర్మన్ ఉత్తంకుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, మల్లు రవి తదితరులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్యాతరాజు సాంబమూర్తి, పైడిపల్లి రమేష్, పిల్లలమర్రి నారాయణ, గురజాల రవి, పొనగంటి శ్రీనివాస్, నాగపురి సమ్మయ్య గౌడ్, రమణాచారి, పుల్ల మహేష్, గన్నారపు రమేష్, కావేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతుచిక్కని వ్యాధితో కోళ్లు

- కుదేలవుతున్న పౌల్ట్రీ పరిశ్రమ
- చికెన్ లవర్స్ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక



**విజయవాడ, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఏపీలో అంతుచిక్కని వ్యాధితో పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది.. ఒక్కసారిగా భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటంతో పౌల్ట్రీ పరిశ్రమ దిక్కుతోచని స్థితిలో పడింది. అంతుచిక్కని వైరస్ బారిన పడి నెలరోజుల్లోనే సుమారు 4 లక్షలకు పైగా కోళ్లు మరణించినట్లు తెలుస్తోంది. ఉభయగోదావరి జిల్లాల్లో 450 వరకు పౌల్ట్రీలు ఉండగా, 15 రోజుల్లోనే లక్షల్లో కోళ్లు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. ఈ వైరస్ వల్ల సగటున కోడికి రూ.300 వరకు నష్టం వస్తోందని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు. కోళ్ల మరణాలకు కారణాలపై అధికారులు సైతం అంచనాకు రాలేకపోతున్నారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపామని, నివేదిక రావాల్సి ఉందని అంటున్నారు అధికారులు. అంతవరకు ఆరోగ్యంగా ఉన్న కోళ్లు అప్పటికప్పుడే కుప్పకూలి చనిపోతుండటంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్ల మరణాలు సాధారణమే అయినప్పటికీ ఈ రేంజ్ లో మరణాలు సంభవించటం పౌల్ట్రీ రైతులను కలవరపెడుతోంది.. అంతుచిక్కని వైరస్ వేగంగా వ్యాపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రైతులు. రోజురోజుకీ కోళ్ల మరణాల సంఖ్య పెరుగుతుండటంతో వినియోగదారులు చికెన్ కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. చికెన్ కు గిరాకీ తగ్గటంతో అటు వ్యాపారులు, అంతుచిక్కని వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో పౌల్ట్రీ రైతులు సతమతం అవుతున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టి పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలని కోరుతున్నారు రైతులు.

# బలవంతంగా ఉద్యోగాలు పెరికివేస్తున్న ట్రంప్

- జాతీయ భద్రతతో కూడుకున్న సంస్థలకూ చోటు
- సిఐఎలో వ్యతిరేకులపై ట్రంప్ కొరడా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5 (జనంసాక్షి) :** ఇటీవల ట్రంప్ ప్రకటించిన ప్యాకేజీలో భాగంగా ఉద్యోగం వదులుకుంటే వారికి 8 నెలల జీతాన్ని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీనికి మంగళవారం వరకు గడువు ఉంచారు. కానీ, ఈ ఆఫర్‌లో జాతీయభద్రతతో సంబంధం ఉన్న సంస్థలను నాడు చేర్చలేదు. కానీ, కొత్త సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ మాత్రం ఈ ఆఫర్‌లో సీఐఏ కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఈ ఆఫర్‌ను ఉద్యోగులకు తెలియజేశారా, లేదా అన్నదానిపైనా, అలాగే ఎవరెవరికి వర్తిస్తాయనే అంశాలపైనా స్పష్టత లేదు. ఈ క్రమంలో తనను ఇబ్బందిపెట్టిన డీప్‌స్టేట్‌ను ఏమాత్రం సహించనని గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన వాస్తవరూపం దాలుస్తోంది. ఏకంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌కు గుండెకాయ వంటి సీఐఏపై ట్రంప్ కొరడా ఝుళిపించారు. ఆ సంస్థలోని ఉద్యోగులకు బైఅవుట్ ఆఫర్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయంతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు సీఎన్ఎన్‌కు వివరాలు వెల్లడించారు. అమెరికాలో ప్రభుత్వోద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ట్రంప్ కార్యవర్గం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కూడా ఒకటి. ఈవిషయాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. గత వారం అమెరికాలోని ది ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్‌లోని కొందరు ఉద్యోగులకు ఈ కార్యక్రమంలో భాగం కావాలని మార్గదర్శకాలు వెళ్లినట్లు సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది. సీఏఐలోని కొందరు కీలక ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు డీప్‌స్టేట్‌లో భాగమయ్యారని ట్రంప్, ఆయన సన్నిహితులు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. దీనికితోడు సీఐఏ సమాచార సేకరణ, విశ్లేషణలో కొన్ని విభాగాలు భారీగా ఖర్చు చేస్తున్నాయని కూడా భావిస్తున్నారు. మొత్తం అమెరికాలోనే ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించేందుకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి గత నెల ఒక మెమో వెలువడింది. ఈమేరకు ఒక ఈ-మెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు దీనిపై ఓ నిర్ణయానికి రావాలని అందులో వెల్లడించారు.

# వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న పవన్ కళ్యాణ్

- వైద్యుల సూచన మేరకు విశ్రాంతి



**అమరావతి, ఫిబ్రవరి5 (జనంసాక్షి) :** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనారోగ్యానికి గురయ్యారు. ఆయన వైరల్ ఫీవర్‌తోపాటు స్పాండిలైటిస్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నాటి రాష్ట్ర క్యాబినెట్ సమావేశానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోచ్చని అధికారులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న జనసైనికులు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నారు. జీవనవిధానంలో మార్పుల వల్ల స్పాండిలైటిస్ సమస్య వస్తుంది. మెడలో వెన్నెముక భాగంలో డిస్కుల మధ్య నరాలు ఉంటాయి. ఈ నరాల మధ్య ఎక్కువ ఒత్తిడి పడటం వల్ల, నరాలు ఒత్తుకోవటం వల్ల మెడనొప్పి, నడుం నొప్పి వస్తుంటుంది. తీవ్రమైన మెడనొప్పితో పాటు తల తిరగడం, తూలి పడిపోతున్నామనే భావన కలుగుతుంది. అంతేకాకుండా వాంతులు రావడం, వికారంగా అనిపించడం, మానసికంగా దిగులుగా ఉంటుంది. ఈ వ్యాధి ఎక్కువ ముదిరితే చేతికి సంబంధించిన కండరాలు కృశించి పోయే అవకాశం ఉంది. దీనివల్ల రక్తసరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. చేతుల్లో స్పర్శ తగ్గడం, ఆందోళన పడటం, బలహీనంగా ఉండటం, తరచూ తలనొప్పితో బాధపడటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. క్రమంగా జీవన్మరణ సమస్యగా కూడా మారవచ్చు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370